మహిళా మాసపత్రిక

# అనుపమ

రజబ్ - షాబాన్ 1445 హిజ్రీ | ఫిబ్రవరి 2024 | ₹ 15/-

## న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించిన తీర్పు



## సైబర్ కిడ్నాప్




## గెలుపోటములు



మహిళా మాసపత్రిక

# అనుపమ

నిజస్థానం చూపే కరదీపిక

సంపుటి : 13 సంచిక: 2

ఫిబ్రవరి 2024 వెల: రు.15

చీఫ్ ఎడిటర్
**ఎస్.ఎమ్. మలిక్**

ఎడిటోరియల్ టీమ్
**తాహెరా బేగం**
**షహనాజ్ బేగం**
**షహ్నాజ్ ఏజాజ్**

ఎగ్జిక్యూటివ్స్
**సమీనా**
**ఫాతిమా**

చందాలు, అభిప్రాయాలు
పంపవలసిన చిరునామా

anupama
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24576237
E-Mail: anupamamonthly@gmail.com

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్ - 9704317015**

8



## ఆ పిల్లలు చేసిన పాపమేమిటి?

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| హస్తభూషణం | ...... | 04 |
| న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించిన తీర్పు | ...... | 05 |
| సైబర్ కిడ్నాప్ | ...... | 10 |
| గెలుపోటములు | ...... | 12 |
| నరకానికి తీసుకుపోయే మూడు విషయాలు | ...... | 15 |
| అంగన్‌వాడి | ...... | 16 |
| భిన్నమైన జంతువు తోడేలు | ...... | 20 |
| కుంటుపడుతున్న కుటీర పరిశ్రమ | ...... | 21 |
| మోనోపాజ్ కథ క్లైమాక్స్‌కి | ...... | 22 |
| దాయీ | ...... | 24 |
| భార్యాభర్తల సంబంధం | ...... | 26 |
| షర్మిల రాకతో మారబోతున్న ఆంధ్ర రాజకీయ ముఖచిత్రం | ...... | 28 |
| కాకమ్మ కబుర్లు | ...... | 30 |
| స్త్రీ వారసత్వపు హక్కు | ...... | 32 |
| వంటలు– కొబ్బరి పాలతో జున్ను | ...... | 34 |


**ఇక చదవండి ....**

## హస్తభూషణం

**యూరప్ దేశాలలో** పాలస్తీనాకు మద్దతుగా లక్షల మంది ప్రజలు విస్తృతంగా నిరసనలు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా లండన్, వాషింగ్టన్ నగరాల్లో నిరసనలు వెల్లువెత్తు తున్నాయి. అయినప్పటికీ ప్రజాభిప్రాయంతో పని లేదన్నట్లుగా అగ్రరాజ్యాలు ఇజ్రాయిల్‌కు వెన్నుదన్నుగా నిలిచాయి. గాజా నుండి రిపోర్టింగ్ చేస్తున్న వంద మందికి పైగా జర్నలిస్టులు మరణించారు. 24వేల మందికి పైగా పౌరులు మరణించారు. వారిలో పదివేలకు పైగా పిల్లలు ఉన్నారు. 60 వేల మందికి పైగా గాయాలకు గురయ్యారు. ప్రస్తుతం గాజా పిల్లల శ్మశానవాటికగా మారిందని, ఇస్రాయిల్ దురాక్రమణ ఆపివేయాలని పలు దేశాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్ దాడులపై అంతర్జాతీయ న్యాయస్థానం (ICJ)లో కేసు వేసింది. ఇస్రాయిల్ దాడులను మానవ హననంగా భావిస్తూ యుద్ధ నేరంగా పరిగణించాలని దక్షిణాఫ్రికా కోరింది. తన వాదనను వినిపిస్తూ 84 పేజీల అఫిడవిట్‌ను దాఖలు చేసింది. 1948 జెనీవా ఒప్పందం ప్రకారం దీనిని మానవ హననంగా పరిగణిస్తూ వెంటనే ఇజ్రాయిల్ దాడులను ఆపేవిధంగా ఆదేశాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. దక్షిణాఫ్రికాకు మద్దతుగా యమన్, బంగ్లాదేశ్, టర్కీ, మలేషియా, బెలివియా, నమీబియా, ఇండోనేషియా దేశాలు మద్దతుగా నిలిచాయి.

ఇజ్రాయిల్ వారానికి 6వేల బాంబులను పాలస్తీనాలో వేస్తోంది. ఇప్పటికే 85శాతం గాజా ప్రజలు తమ నివాసాలను వదిలి వెళ్ళవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 93 శాతం మంది గాజా ప్రజలు ఆకలితో బాధపడుతున్నారని, వారికి కనీస అవసరాలు లేక ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, వెంటనే వారికి వైద్య సదుపాయాలు అందే విధంగా ఆదేశించాలని కూడా దక్షిణాఫ్రికా కోరింది. అయితే దక్షిణాఫ్రికా కేసుపై స్పందిస్తూ తాము మానవ హననానికి పాల్పడలేదని, దక్షిణాఫ్రికా వాస్తవాలను అర్థం చేసుకోలేదని ఇజ్రాయిల్ వాదించింది. తాము కేవలం ఆత్మ రక్షణకు మాత్రమే ఎదురుదాడి చేస్తున్నామని బొంకింది. ప్రపంచం మొత్తం ఈ వాద ప్రతివాదనలను వీక్షిస్తుందన్న కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా గాజాలో ఆహారానికి, వైద్యానికి కొరత ఏమీ లేదని నిస్సిగ్గుగా వాదించింది. జెనీవా ఒప్పందాన్ని దక్షిణాఫ్రికా అసలు అర్థం చేసుకోలేదని తాము చేసేది మానవ హననం కానేకాదని ప్రకటించుకుంది. దానిని అమెరికా కూడా అక్కడ మానవ హననం జరగలేదని సమర్థించింది.

వివిధ ప్రాంతాలకు చెందిన 15 మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఈ కేసు వాదోపవాదాలను పరిశీలిస్తుంది. అయితే ఈ కేసులో ఒకవేళ ఇజ్రాయెల్ దాడులను నిలిపివేయాలని, మిలటరీని వెనక్కి తీసుకోవాలని ICJ ఆదేశించినా ఇజ్రాయెల్ దానికి కట్టుబడుతుందన్న గ్యారంటీ ఏమీలేదు. అసలు ఆ ఆదేశాన్ని అమలు ఎవరు జరిపిస్తారు అనేది కూడా ప్రశ్నే. అత్యధిక మెజారిటీతో ఆమోదించిన యుఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానాలను ఇజ్రాయిల్ కనీసం పట్టించుకోలేదు. అలాంటప్పుడు ICJ ఆదేశాలను మాత్రం అమలు చేస్తుందని నమ్మకం ఏమిటి?

ICJ లో కేసుపై తొందరగా తీర్పు వస్తుందని ఆశించడం కూడా అడియాసే. 2019లో రోహింగ్యాల గురించి మయన్మార్‌పై గాంబియా వేసిన కేసుపై ఇంకా నిర్ణయం రాలేదు. గాజా విషయంలో అదే జరిగితే ఈ కేసు వలన జరిగే ప్రయోజనం కూడా ఏమి లేదనే చెప్పాలి. అయితే అగ్ర రాజ్యాలు కళ్ళకు గంతలు కట్టుకొని వ్యవహరిస్తుంటే బలహీన దేశాలు న్యాయం కోసం ICJ తలుపు తట్టడం ప్రశంసించవలసిందే. కేవలం 2 శాతం ముస్లిం జనాభా ఉన్న దక్షిణాఫ్రికా ICJ లో కేసు వేసింది. కాని ముస్లిం దేశాలు ముఖ్యంగా OIC దేశాలు ఈపాటి ధైర్యం కూడా చేయలేక పోవడం సిగ్గుచేటు.

కవరు కథనం

షహనాజ్ ఎజాజ్



# న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించిన తీర్పు

బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది. సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం జస్టిస్ బి.వి నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల తీర్పు ఎట్టకేలకు అటు బాధితురాలు బిల్కిస్ బానోకు, ఇటు ఎంతోమంది సామాజిక కార్యకర్తలకు, న్యాయాన్ని వాంఛించే సాధారణ పౌరులకు ఊరట కలిగించింది. సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ అధికార దుర్వినియోగంపై అధిక్షేపించింది. బిల్కిస్ బానో కేసులోని 11 మంది నేరస్తులను రెండు వారాల్లోగా జైలుకు పంపించాలని ఆదేశించింది.

ఆగస్టు 15, 2022న గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్ బానో కేసులోని 11మంది నేరస్తులను భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంలో సత్ప్రవర్తన క్రింద విడుదల చేసింది. అత్యంత దారుణకాండకు పాల్పడిన వారిని స్వేచ్ఛాయుత సమాజంలో విడిచిపెట్టడాన్ని పలువురు వ్యతిరేకించారు. కొందరు రిటైర్డ్ ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, విద్యావేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు, రచయితలు, జర్నలిస్టులు, మహిళా సంఘాల ప్రతినిధులు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. నేరస్తుల విడుదల తరువాత న్యాయంపై నమ్మకం కోల్పోయానని ఇంకా కోర్టుల చుట్టూ తిరగ లేనని చెప్పింది బిల్కిస్ బానో. అయితే పార్లమెంట్ సభ్యురాలు మహువా మొయిత్రీ, మాజీ పార్లమెంట్ సభ్యురాలు సుభాషిణి అలీ, ప్రొఫెసర్ రూప్‌రేఖ వర్మ, జర్నలిస్ట్ రేవతిలాల్, మాజీ ఐపీఎస్ అధికారి మీరన్ చద్ద బోర్వాంకర్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వారిని చూసి బిల్కిస్‌బానో కూడా మళ్ళీ సుప్రీంకోర్టులో నేరస్తుల విడుదలకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశారు.

గుజరాత్ ఎన్నికల సమయంలో వీరిని విడుదల చేయటం జరిగింది. అయితే ఇది కేవలం రాజకీయ ప్రయోజనం కోసం

చేసిన విడుదల అని చాలామంది విమర్శించారు. గుజరాత్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ వెన్నుదన్నుతో నేరస్తులను విడుదల చేయటం అంటే రాజకీయ లబ్ధి కోసం నేరస్తులకు కొమ్ము గాయటమే. 15 ఆగస్టు 2022న ప్రధాని నరేంద్రమోదీ తన ఎర్రకోట ప్రసంగంలో ప్రజలను ఉద్దేశించి స్త్రీలను అగౌరవంగా చూసే ఒక దురలవాటు మన దేశంలో పెరిగిందని దీనిని సంస్క రించుకోవాలని అన్నారు. అయితే అదే రోజున విడుదల అయిన 11 మంది నేరస్తులకు బిజెపి, విహెచ్‌పి నాయకులు పూలమాల లతో, మిఠాయిలతో సత్కరించడం, వారి కాళ్ళకు మొక్కడం మీడియాలో మనం చూశాము. అదే విధంగా బిజెపి ఎమ్మెల్యే వీరిని సంస్కారవంతమైన బ్రాహ్మణులు అని పొగడడం కూడా విన్నాం. ఈ వైఖరి ఇలాంటి నేరాలను ప్రోత్సహించడమే అవుతుంది.

ఇంతటి క్రూరమైన నేరస్తులకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు సిఫారసు చేసిందని కోర్టు ప్రశ్నించింది. అలాగే గుజరాత్ ప్రభుత్వం నేరస్తులకు సహాయపడిందని, ప్రభుత్వం తీసుకున్నది మతిలేని చర్య అని కోర్టు మండిపడింది. స్త్రీలను గౌరవించాలని చెప్పిన మోదీ ప్రభుత్వం గుజరాత్ ప్రభుత్వం చేసిన ఈ అధికార దుర్వినియోగానికి, నిర్లక్ష్య చర్యకు సమాధానం కోరుతుందా?

2002లో జరిగిన గుజరాత్ మారణహోమంలో బాధితురాలు బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ సమయంలో ఆమె ఐదు నెలల గర్భిణి. ఆమె మూడు సంవత్సరాల కూతురిని ఆమె ముందే నేలకేసి కొట్టి చంపడం జరిగింది. ఆమె ముందే ఆమె తల్లిపై కూడా అత్యాచారం చేసి హత్య చేశారు. ఆమె కుటుంబంలో మొత్తం ఏడుగురిని హత్య చేశారు. అయితే అప్పుడు కూడా గుజరాత్ ప్రభుత్వం నేరస్తులకు అండగా వ్యవహరిస్తుందని కోర్టు జోక్యం చేసుకుని ఈ కేసును సిబిఐకు అప్పగించింది. సిబిఐ ఈ కేసును గుజరాత్ హైకోర్టు అయితే సాక్షులకు ప్రమాదం ఉండవచ్చని సరైన న్యాయం జరగకపోవచ్చని ముంబై కోర్టుకు ఈ కేసును తరలించింది. 2008లో ముంబై హైకోర్టు నేరస్తులకు జీవితఖైదు విధించింది. అలాగే 2019లో బిల్కిస్ బానోకు రూ.50లక్షల నగదు, ఒక ఇల్లు, ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. బిల్కిస్ బానోకు ఈ పరిహారం సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఆదేశించే వరకు గుజరాత్ ప్రభుత్వం ఇవ్వలేదు.

నేరస్తులలో ఒకరైన రాధేశ్యామ్‌షా 2019లో శిక్ష తగ్గించాలని ముంబై కోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసును రద్దు చేస్తూ శిక్ష తగ్గించడం కుదరదని ముంబై హైకోర్టు తెలియజేసింది. ఆ తరువాత సిబిఐను కూడా శిక్ష తగ్గించాలని కోరారు. సిబిఐ కూడా కుదరదని అభిప్రాయం తెలియజేసింది. దాంతో గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. గుజరాత్ హైకోర్టు శిక్ష తగ్గించే అధికారం కేవలం ముంబై హైకోర్టుకు మాత్రమే ఉందని పేర్కొంటూ పిటిషన్‌ను రద్దు చేసింది. అయితే 2022 మార్చిలో మళ్ళీ శిక్ష తగ్గింపు కోసం పిటిషన్‌ను సుప్రీంకోర్టులో వేశారు. అయితే 2022 మేలో సుప్రీం కోర్టు ఈ ఘటన గుజరాత్‌లో జరిగినందున దీనిని గుజరాత్ ప్రభుత్వం పరిశీలించాలని ఆదేశించింది. మూడు నెలల్లో గుజరాత్ ప్రభుత్వం ఒక కమిటీ నిర్ణయం ఆధారంగా వీరిని విడుదల చేయడానికి సిఫారసును కేంద్ర ప్రభుత్వానికి పంపడం అక్కడి నుండి సమ్మతి కేవలం రెండు వారాలలో లభించడంతో 2022 ఆగస్టు 15న వీరిని సగౌరవంగా విడుదల చేసింది గుజరాత్ ప్రభుత్వం.

బిల్కిస్ బానో నేరస్తుల విడుదలపై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు గుజరాత్ ప్రభుత్వం నేరస్తులను ఏ ఆధారంగా విడుదల చేశారో వివరణ ఇవ్వాలని కోరింది. సుప్రీం కోర్టు పదేపదే ఆదేశించినా గుజరాత్ ప్రభుత్వం ఆధారాలు చూపడానికి తాత్సారం చేసింది. దస్తావేజులు అన్ని గుజరాతీ భాషలో ఉన్నందున సుప్రీంకోర్టుకు సమర్పించడం ఆలస్యమవుతుందని సమయాన్ని వృధా చేసింది. అలాగే 13 మే 2022లో సుప్రీంకోర్టు స్వయంగా ఆదేశించడం వల్లనే విడుదల చేశామని వాదించింది. దీనికి సమాధానంగా సుప్రీంకోర్టు కేవలం పరిశీలించమని మాత్రమే ఆదేశించిందని, అయితే పిటిషన్‌లో సుప్రీంకోర్టును మోసం చేశారని జస్టిస్ బి.వి నాగరత్న అన్నారు. వాస్తవానికి గుజరాత్ హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేసు వేయాలి. కాని గుజరాత్ హైకోర్టు నిర్ణయాన్ని దాచి కొత్త పిటిషన్ వేయడం కోర్టును మోసం చేయడం అని కోర్టు సమయాన్ని వృధా చేయడం అని జస్టిస్ బి.వి నాగరత్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాత్ ప్రభుత్వం వీరిని సత్ప్రవర్తన కింద విడుదల చేశామని సమర్థించుకోగా ఇటువంటి తీవ్రమైన నేరాలు చేసిన వారిని ఇప్పటివరకు ఏ ఏ రాష్ట్రాలలో ఎంతమందిని విడుదల చేశారో చెప్పండని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. ఇది అరుదైన కేసు కాదని, అందువల్ల సత్ప్రవర్తన క్రింద విడుదల చేశామని గుజరాత్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. ఈ కేసు ఒక మారణహోమంలో భాగం. ఈ కేసు 14 మంది హత్య, ముగ్గురు మహిళల సామూహిక అత్యాచారంపై దాఖలైంది. ఇది అరుదైన కేసు కాదని ప్రభుత్వం చెప్పిందంటే ఇది సాధారణమైన ఘటనగా మాత్రమే ప్రభుత్వం భావిస్తుందని అర్థం అవుతుంది. ఈ మారణహోమాన్ని అరుదైనది కాదు అనడం గుజరాత్ ప్రభుత్వ దుర్మార్గానికి అద్దం పడుతుంది.

నేరస్తులు 14 సంవత్సరాలు పూర్తయ్యాయని శిక్ష తగ్గించమని కోరారు. కాని శిక్షా కాలంలో వీరు బెయిల్ మీద, పెరోల్ మీద కనీసం మూడు నుండి నాలుగు సంవత్సరాలు జైలు బయటే ఉన్నారు. దీనిని ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు గుజరాత్ ప్రభుత్వం? పైగా పరివర్తన, పునరావాసం కల్పించాలని వారి

ప్రాథమిక హక్కు అయిన స్వేచ్ఛను వారికి కల్పించాలని వాదించింది. మారణహోమం సృష్టించిన కిరాతకుల స్వేచ్ఛకు ఇంత ప్రాముఖ్యత ఉంటే గత 20 ఏళ్ళుగా ప్రాణభయంతో దేశ దిమ్మరి లాగా వివిధ ప్రదేశాలలో తలదాచుకుంటున్న బిల్కిస్ బానో స్వేచ్ఛ గురించి గుజరాత్ ప్రభుత్వం కనీసం బాధ్యత వహించక పోవడం ఆ ప్రభుత్వ మత మౌఢ్యానికి తార్కాణం. ఈ కేసుకు ముందుగా జస్టిస్ జోసెఫ్ న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఆయన మేలో రిటైర్డ్ అవుతూ ఈ కేసులో గుజరాత్ ప్రభుత్వం కావాలనే సమయాన్ని వృథా చేస్తుందని ఆరోపించారు.

అయితే నేరస్తులు మైనార్టీ వర్గానికి చెందినవారై ఉంటే గుజరాత్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించేదా లేక బాధితురాలు ముస్లిం కాకుండా వేరే వర్గం అయి ఉంటే ఇలాంటి నిర్లక్ష్య చర్యను చేపట్టేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భారత న్యాయ వ్యవస్థ గౌరవాన్ని సుప్రీంకోర్టు తీర్పు నిలబెట్టిందని పలువురు హర్షం వ్యక్తపరిచారు. అయితే ఈ కేసును మళ్ళీ ముంబై హైకోర్టులో వేసే అవకాశం లేకపోలేదని, ప్రస్తుతం మహారాష్ట్రలో బిజెపి పొత్తుతో ఏర్పడిన ప్రభుత్వం ఉండటం వల్ల మళ్ళీ వీరు విడుదల అయ్యే ప్రమాదం ఉందని మాజీ పార్లమెంట్ సభ్యురాలు సుభాషిణి అలీ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లభిస్తుందా అని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం నేరస్తులు పరారీలో ఉన్నారు. నేరస్తులు ముంబై హైకోర్టులో పిటిషన్ వేయాలంటే ముందు జైలుకు వెళ్ళాలి. అక్కడి నుంచి పిటిషన్ వేయాల్సి ఉంటుంది. అలాగే మహారాష్ట్రలో సాధారణ జీవిత ఖైదు మహిళలు, బాలికల విషయానికి సంబంధించిన కేసులో 20 సంవత్సరాలు అలాగే తీవ్రమైన కేసులలో 28 సంవత్సరాల శిక్ష ఉంటుంది. తరువాత శిక్ష తగ్గింపునకు ఆస్కారం ఉంది. ఏది ఏమైనా ఎట్టకేలకు 20 సంవత్సరాల తరువాత బిల్కిస్ బానోకు న్యాయం జరిగింది.

కేవలం బిల్కిస్‌బానో కేసు మాత్రమే కాకుండా కథువా కేసులో కూడా నేరస్తులను సమర్థిస్తూ బిజెపి నాయకులు జాతీయ జెండాను చేతబూని ధర్నాలకు దిగడం మనం చూసిందే కదా. అలాంటి కేసే మరొకటి ప్రస్తుతం బెనారస్ హిందూ యూనివర్సిటీలో జరిగింది. నవంబర్ 1, 2023న ఐఐటీ విద్యార్థినిని ముగ్గురు యువకులు రివాల్వర్‌తో బెదిరించి ఆమెను వివస్త్రను చేసి అత్యాచారం చేసిన కేసు బయటకు వచ్చింది. అయితే ఈ కేసులో కూడా నేరం జరిగిన ఏడు రోజులలోనే నిందితులను బాధితురాలు గుర్తించినప్పటికీ కనీసం వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు సహకరించకపోగా రెండు నెలల వరకు నిందితులను అరెస్ట్ చేయలేదు. కారణం నిందితులు కునాల్ పాండే, సక్షమ్ పటేల్, అభిషేక్ చౌహాన్‌లు ప్రధాని నరేంద్రమోదీ నియోజకవర్గమైన వారణాసిలో బిజెపి ఐటీ సెల్‌లో పనిచేసే ప్రముఖులు కావడం. నిందితులు ఐఐటీ విద్యార్థినిపై అత్యాచారం చేసి అక్కడి నుండి మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్నారంటే బిజెపి ప్రభుత్వం వీరికి వెన్నుదన్నుగా ఎలా నిలబడిందో అర్థం అవుతుంది.

ఈ ముగ్గురు నేరస్తుల ఫోటోలు ప్రధాని నరేంద్రమోదీతో, జె.పి నడ్డా ఇంట్లో దిగిన ఫోటోలు. స్మృతి ఇరానీతో, అనురాగ్ ఠాకూర్‌తో ఇంకా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌తో దిగిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫోటోలు చూస్తే వీరికి బిజెపి నాయకుల అండదండలు ఎంతగా ఉన్నాయో తెలుస్తుంది. అలాగే విద్యార్థులు గత రెండు నెలలుగా ధర్నాలు చేస్తున్నప్పటికీ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ దీనిపై ఎటువంటి చర్య తీసుకోకపోవడం వీరికి అధికార పార్టీ ఎంతగా కొమ్ముకాస్తుందో అర్థం అవుతుంది.

డిసెంబర్ నెలలో కార్డిలా ఫార్మా సీఎండి రాజీవ్ మోదీపై 27 సంవత్సరాల బల్గేరియన్ మహిళా ఉద్యోగి తనపై అత్యాచారం జరిగిందని కేసు నమోదు చేయబోతే పోలీసులు సహకరించక పోవడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది. కారణం రాజీవ్ మోదీ బిజెపితో సత్సంబంధం కలిగి ఉండటంతో అక్కడి ప్రభుత్వం అండగా వ్యవహరిస్తుందని విమర్శలు ఉన్నాయి. అలాగే ఒలంపిక్స్‌లో పథకాలను సాధించిన భారత మహిళా రెజ్లర్ సాక్షి మలిక్ బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్ లైంగిక వేధింపులపై నిరసన వ్యక్తం చేశారు. ఆమెకు మద్దతుగా బజరంగ్ పూనియా, వినేశ్ పొగాట్‌లు తమ అర్జున అవార్డులను ప్రధాని నివాసం ముందు వదలి వెళ్ళారు. అయితే సాక్షి మలిక్ నిరసనపై ఎటువంటి చర్య తీసుకోలేదు. దీనికి నిరసనగా ఆమె భారత రెజ్లింగ్ నుండి తాను తొలగిపోతున్నానని ప్రకటించారు.

బిజెపి అండదండలతో మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు విచ్చలవిడిగా జరుగుతున్నా, మహిళా శిశు మంత్రి స్మృతి ఇరాని నోరు మెదిపింది లేదు. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ఫ్లైయింగ్ కిస్‌పై గర్జించిన ఈ మహిళామణి పైన పేర్కొన్న అన్ని కేసులలోను పెదవి విప్పింది లేదు. బిజెపి మహిళా నాయకురాళ్ళకు మహిళల గౌరవంపై ఎంత ఆసక్తి ఉందో అర్థం అవుతుంది. నారీశక్తి, నారీ సమ్మాన్, బేటీ బచావ్, బేటి పడావ్ నినాదాల ప్రభుత్వం నారీ గౌరవంపై కనీసం దృష్టి పెట్టకపోయినా ఫర్వాలేదు. నేరస్తులకు కొమ్ముకాయకుంటే అదే వారు చేసే మేలు. మార్చిలో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మహిళలు కాస్త వివేకంతో తమ ఓటు హక్కును వినియోగించుకుంటే వారి గౌరవాన్ని వారు కాపాడుకున్నట్టే. ఎందుకంటే ప్రభుత్వాలు నేరస్తుల సహచరులుగా వ్యవహరిస్తున్నాయి. కాబట్టి మహిళా ఓటర్లు తమ ఓటునే తమ ఆయుధంగా ఉపయోగించుకోగలిగితే మున్ముందు ఇటువంటి కేసులు తగ్గవచ్చేమో! ఇక మహిళల వివేకంపైన వారి భద్రత ఆధారపడి ఉంది. ✤

కథ

షహనాజ్, అనంతపురం



# ఆ పిల్లలు చేసిన పాపమేమిటి?

**చాలాకాలం తరువాత సమీరాను ఓ పెళ్ళి వేడుకలో చూశాను. సమీరా తన భర్త నుండి విడిపోయి మరో వివాహం చేసుకుని అమెరికా వెళ్ళిపోయిందని విన్నాను. ఇన్నేళ్ళకి ఆమెను హైదరాబాద్‌లో జరిగిన ఒక పెళ్ళి వేడుకలో కలిశాను. మేమిద్దరం ఒకర్నొకరం చూసుకుని ఆశ్చర్యానందాలలో మునిగిపోయాము.**

అన్నట్టు, సమీరా నా బాల్య స్నేహితురాలు. మా దూరపు బంధువు కూడా. ఇద్దరం ఒకే స్కూల్లో, ఒకే కాలేజీలో చదువుకున్నాము. వివాహానంతరం ఇద్దరం వేర్వేరు ప్రదేశాలకు వెళ్ళిపోవటం జరిగింది. తిరిగి ఇన్నేళ్ళకి కలుసుకోవటం నాకెంతో ఆనందాన్ని కలిగించింది.

ఎలా ఉన్నావు? ఎలా ఉంది నీ కొత్త జీవితం? అంటూ ఆమె క్షేమ సమాచారాలను అడిగాను.

'ఓహ్ ఇప్పటివరకు బాగానే ఉన్నాను. ఉండు మా వాళ్ళని, నా కుటుంబాన్ని పరిచయం చేస్తాను' అంటూ అక్కడే ఉన్న ఓ పది నుండి పదహారేళ్ళ వయసు మధ్య గల పిల్లల్ని పిలిచి ఇదిగో వీళ్ళు ముగ్గురు మునీరా, ఆరిఫ్, జేబా, అంటూ పరిచయం చేస్తూ ''వీళ్ళు ముగ్గురు నా భర్త జావెద్ పిల్లలు. తన మొదటి భార్యకు కలిగిన పిల్లలు. ఆమెకు తలాక్ ఇచ్చి నన్ను చేసుకున్నాడన్న విషయం తెలుసు కదా. ఈ ముగ్గురు పిల్లలు మా దగ్గరే ఉంటున్నారు. అదిగో అక్కడ కూర్చున్నాడే బబ్లూ వాడు నా కొడుకు. నా మొదటి భర్తకు పుట్టినవాడు. నా భర్త ద్వారా ఖులా తీసుకున్నాక జావెద్‌తో నికాహ్ జరిగింది. నా కొడుకు నా దగ్గరే ఉన్నాడు. ఇక చివరగా ఇదిగో ఈ చంటివాడు జావెద్‌కు నాకు పుట్టిన బిడ్డ అయాన్. ఇలా సమీర చెప్పుకుపోతుంటే నా తల గిర్రున తిరిగిపోయింది.

ఇక నిలబడే శక్తి లేక కుర్చీలో కూర్చుండిపోయాను. సమీర చెప్పిన మాటలను అర్థం చేసుకోవటానికి చాలా సమయం పట్టింది.

ఇలాంటి జీవితాల గురించి నేను ఎన్నో విని ఉన్నాను. కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే నాకు ఎలాగో ఉంది. అదీ నాకు సన్నిహితురాలయిన ఒక మహిళ జీవితంలో ఇలా జరగటం.

ఏమిటీ వైపరీత్యం?

ఆ పిల్లల కళ్ళల్లో ఏదో అవిశ్వాసం, అభద్రతా భావం గోచరించాయి. జావెద్ పిల్లల్ని చూస్తుంటే నాకు అదోలా అనిపించసాగింది. నాలో ఎన్నో ప్రశ్నలు. ఆ ముగ్గురు పిల్లల తల్లి ఎటు పోయింది? ఏమైపోయింది?? తన పిల్లల కోసం తల్లడిల్లిపోవటం లేదా?

ఇంతలో అక్కడేదో గొడవ జరిగినట్టనిపించింది. ఇంత క్రితం సమీర చూపించిన పిల్లలు పెద్దగా గొడవపడుతున్నారు. అంతకంటే ఎక్కువగా సమీర అరుస్తున్నది. ఇంగ్లీషులో తిట్ల వర్షం కురిపిస్తున్నది. 'ఏమైంది? ఏమి జరిగింది' అంటూ అడిగాను ప్రక్కవాళ్ళతో.

'తన కొడుకుని ఆ పిల్లలు ఏదో అన్నారట. కొట్టారని కూడా అంటోందామె' చెప్పారెవరో.

నాకు పరిస్థితి అర్థమైంది. జావెద్ పిల్లలు ఆమె పిల్లాడు కొట్టుకున్నారన్నమాట. అది సహజం. వారిలో అసూయా ద్వేషాలు కలగటం సహజమే మరి. తన స్థానంలో మరొకరు ఉండటం సహించలేరు కొందరు. అక్కడ అదే జరిగింది.

ఆ పిల్లల్లో ఒకరికి తండ్రి ఉన్నాడు గాని తల్లి లేదు. మరొకరికి తల్లి ఉంది గానీ తండ్రి లేడు. అలాంటి వాతావరణంలో పెరుగుతున్నారు. వారి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది మరి? చిన్న పిల్లల పవిత్ర హృదయాలు కల్మషం ఎరుగవు. చిన్న వయసులోనే పలు రకాల సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది.

కారకులు వారి కన్నవాళ్ళే. తమ 'ఇగో'లతో, అహంకారంతో, తమ జీవిత భాగస్వాములతో విడిపోయి పసిపిల్లలను బలి చేస్తున్నారు. ఆ పిల్లల గురించి ఆ భార్యాభర్తలు నిత్యం గొడవ పడ్తుంటారట.

అతని పిల్లలను దండిస్తే అతను ఆమెను కొట్టినంత పని చేస్తాడట. అతను ఆమె కొడుకుపై కోప్పడితే ఆమె ఊరుకోదట. అరిచి గీ పెట్టి తగువు పెట్టుకుంటుందట. ఒక దశలో ఇంట్లో నుంచి వెళ్ళిపోవటానికి కూడా సిద్ధపడ్తుందట.

కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇవ్వకుంటే ఇలాంటి సమస్యలే ఉద్భవిస్తుంటాయి. ప్రతి మనిషి జీవితంలో ఏవో సమస్యలు, దుర్ఘటనలు, ఘర్షణలు జరిగిపోతుంటాయి.

అన్ని సమస్యలకు, బాధలకు సమన్వయం పాటించాలి. ఆగ్రహావేశాలలో ఏ నిర్ణయం తీసుకోకూడదు. తల్లిదండ్రుల స్వార్థ చింతనతో ఆ పసి వాళ్ళ బాల్యాన్ని చిదిమేస్తున్నారు. కన్నవాళ్ళుగా తమ ధర్మాన్ని, కర్తవ్యాన్ని విస్మరించటం ఎంత వరకు సమంజసం? పిల్లల కోసమంటూ ఎంత మంది తమ జీవితాలలో సర్దుకుపోవడం లేదు.

ఇక్కడ సమీర, జావెద్‌లు ఇద్దరికి ఇద్దరు తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నట్లు అనిపించింది. ఆ పిల్లల్ని చూస్తుంటే గుండెల్ని పిండేసినట్లయ్యింది.

బాధాతప్త హృదయంతో ఇంటికి వచ్చాను.

★★★

కొన్ని రోజులు అలా గడిచిపోయాయి. ఒకసారి మాకు దూరపు బంధువయిన వరుసకు అక్క అయిన జాహెదా ఆపా ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది. నేను వెళ్ళేసరికి జాహెదా ఆపా ఇంచుమించు రెండు, రెండున్నర సంవత్సరాల వయసు గల ఇద్దరు చంటి పిల్లలకు ఓ చిన్న గిన్నెలో అన్నం కలిపి గోరుముద్దలు తినిపిస్తోంది.

'ఆపా... ఎవరీ పిల్లలు. నీ మనవళ్ళు కాదు కదా' అడిగాను నేను.

దానికామె గాఢంగా నిట్టూర్పు విడిచి 'కాదు, నా చెల్లెలు షాహెదా కూతుళ్ళ పిల్లలు. వారి సంగతి తెలుసు కదా. వాళ్ళిద్దరూ తమ తమ భర్తలతో పొసగక గొడవలు పడి ఖులా ఇచ్చేసి మరో నికాహ్ చేసుకుని మరో ప్రాంతంలో ఉంటు న్నారు. ఈ పిల్లలను నా చెల్లెలు షాహెదా, ఆమె భర్త తమ సంరక్షణలో ఉంచుకున్నారు. ఈ వేళ వాళ్ళిద్దరూ ఎటో బయటికి వెళ్తూ నా దగ్గర వదిలివెళ్ళారు. పిల్లలు ఆకలిగొంటే అన్నం తినిపిస్తున్నాను. ఏమిటో ఈ బంధాలు? ఎక్కడ పెరగవలసిన ఈ పిల్లలు ఎక్కడ పెరుగుతున్నారు? కన్న తల్లి ఎక్కడుందో? కన్న తండ్రి ఎక్కడున్నాడో అంటూ నిట్టూర్చింది.

నా కళ్ళల్లో నీళ్ళు నిల్చాయి.

షాహెదాకు ఇద్దరు ఆడపిల్లలు. సమీన, నూరి. ఇద్దరికి మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేశారు. కాని పెళ్ళయి బిడ్డలకు తల్లులయిన తరువాత తమ భర్తలతో విడిపోయి, పుట్టింటికి చేరారు. వాళ్ళు విడిపోవడానికి వారి తల్లిదండ్రుల ప్రోద్భలం కూడా ఉందని బంధువుల్లో చెప్పుకోవడం విన్నాను.

కన్న తల్లిదండ్రుల నడుమ వారి ప్రేమానురాగాలలో వారి సంరక్షణలో పెరగవలసిన ఆ పిల్లలు పరాయి వారి చెంత పెరగటం ఏమిటి? వారికి తమ బాధ్యతలు, కర్తవ్యం గుర్తుకు రావా? ఏ పాపం చేయని నేరానికి ఆ చిన్నారులు శిక్ష అనుభవించాలా?

వివాహానికి, దాంపత్య జీవితానికి, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇవ్వకుంటే ఎన్నో జీవితాలు ఛిద్రమవుతాయి. కొత్తతరం, నవ తరం, కొత్త కొత్త భావనలంటూ సహజీవనాలు, కాంట్రాక్ట్ పెళ్ళిళ్ళు వంటి పాశ్చాత్య సంస్కృతి అలవర్చుకుంటే ఇక పతనమే తప్ప సుఖ జీవితమంటూ ఉండదు.

పెళ్ళయి, పిల్లలు కలిగిన వాళ్ళు విడిపోకూడదనే చట్టం కూడా రావటం అవసరం ఎంతైనా ఉంది. ఈ సమాజం ఎటు పోతున్నదో. చిన్న పిల్లలకు, యువతకు ధార్మిక జ్ఞానం కలిగించి, వారిలో పాపభీతి, దైవభీతి, మానవత్వం పరిమళించేందుకు పాటుపడదాం.

✤




# సైబర్ కిడ్నాప్

**సమీనా సలీమ్**

**సైబర్ నేరాలు** రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు, ప్రజలకు తెలియకుండానే వారి డబ్బులను దోచుకుంటున్నారు

సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపి నిలువునా ముంచుతున్నారు. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఆధార్ నంబర్ చెప్పండి, మీ ఏటీఎం పని చేయడం లేదని, కారు గెల్చుకున్నారని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో క్రెడిట్ కార్డులిమిట్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ తెలియకుండానే డబ్బులు కాజేస్తుంటారు.

**ఇవి పాటించాలి**

- మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికీ చెప్పొద్దు
- అనవసర సమయాల్లో ఇంటర్నెట్ ఆఫ్ చేయడం మంచిది.
- గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు.
- అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలి.
- బహుమతులు, లాటరీలు గెల్చుకున్నారంటూ వచ్చే




సందేశాలను గుడ్డిగా నమ్మవద్దు.


- వర్క్ ఫ్రం హోం ఉద్యోగం కల్పిస్తామని చెప్పే వారితో జాగ్రత్తగా ఉండాలి.
- బయటి ప్రాంతాల్లో ఉచిత వై-ఫై ఉపయోగించకపోవడం మంచిది.
- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలు అప్‌లోడ్ చేయవద్దు.

## టోల్ ఫ్రీ నంబర్ -1930

ఆన్‌లైన్ మోసాలే కాకుండా సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీసులు గ్రామాల్లో, పాఠశాలు, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేస్తే 24 గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

## కొత్త విధానాలతో మోసాలు

రోజురోజుకీ సైబర్ నేరాలు పెరగడమే కాకుండా కొత్తకొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. తాజాగా అమెరికాలో జరిగిన సైబర్ కిడ్నాప్ అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. మనుషుల అవసరం లేకుండా జరిగే సరికొత్త కిడ్నాప్ ఇది. ఇదెలా ఉంటుందంటే.. క్రెడిట్ కార్డులు, బ్యాంక్ డీటెయిల్స్ కొట్టేయడం వంటి సైబర్ నేరాలే మనకు తెలుసు. అయితే ఇప్పుడు టెక్నాలజీని ఉపయోగించి మనుషులను మాయం చేసే ప్రయత్నం కూడా చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. దీన్నే సైబర్




కిడ్నాప్/ డిజిటల్ అరెస్ట్ అంటున్నారు. రీసెంట్‌గా మనదేశంలో ఒక మహిళను అలాగే అమెరికాలో ఒక విద్యార్థిని ఈ తరహాలో కిడ్నాప్ చేసిన వార్తలు ప్రస్తుతం సంచలనంగా మారుతున్నాయి.

సైబర్ కిడ్నాప్‌లో కిడ్నాపర్లు ఉండరు. ఎవరికి వారే స్వయంగా కిడ్నాప్ అయ్యేలా సైబర్ నేరగాళ్లు ప్లాన్ చేస్తారు. కిడ్నాపర్లు ఆన్‌లైన్ ద్వారా పర్సనల్ సమాచారాన్ని దొంగిలించి లేదా ఇతర పద్ధతుల ద్వారా బాధితులను బెదిరించి తమకు తాము ఒక ప్రదేశానికి వెళ్లేలా చేస్తారు. అలా ఎవరికీ తెలియని చోట దాక్కునేలా చేసి ఆ వీడియోలను బాధితుల కుటుంబాలకు పంపి డబ్బు పంపమని బెదిరిస్తారు. తాజాగా అమెరికాలో ఒక స్టూడెంట్‌ను ఇలాగే బెదిరించి అతడు ఉండే గ్రామానికి దూరంగా ఒక టెంట్‌లో దాక్కునేలా చేశారు. ఆ ఫొటోలు కుటుంబ సభ్యులకు పంపి డబ్బు వసూలు చేశారు. కిడ్నాపర్లు ప్రత్యక్షంగా ఇన్వాల్వ్ అవ్వకుండా ఆన్‌లైన్ ద్వారానే ఈ కిడ్నాప్‌ను ప్లాన్ చేశారన్న సంగతి తెలిసిన తర్వాత పోలీసులు అవాక్కయ్యారు.

ఏఐ టెక్నాలజీతో చేసే ఫేక్ రోబో కాల్స్ స్కామ్ ఇటీవలి కాలంలో ఎక్కువ అవుతున్నాయి. కాబట్టి గుర్తు తెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలి. ఫోన్ చేసి ఫలానా వ్యక్తిని అని ఒకరు మీతో చెప్తే అది నిజమైన వ్యక్తి కాకపోవచ్చని తెలుసుకోవాలి. పర్సనల్ వివరాలను షేర్ చేసుకోకుండా జాగ్రత్తపడాలి. - లింక్స్‌ను క్లిక్ చేయకూడదు. సంస్థల పేరు మీద వచ్చే కాల్స్ / మెసేజ్‌లను కూడా అనుమానించాల్సిందే.




**నేనొక** ప్రేమ పిపాసిని... నీవొక ఆశ్రమ వాసివి.

ఎవరో నా మైండ్ సెట్‌కి చాలా దగ్గరగా ఆలోచించేవారు, మన స్సును కోసే బాధతో ఈ పాట వింటూ వాకింగ్ చేస్తున్నట్టున్నారు.

హుం... చాలామందికి ప్రేమ పిపాసి... ఆశ్రమవాసి వంటి పదాలకు అర్థమే తెలియని, తెలుసుకోవాలనే కోరికే లేని తరాన్ని తయారు చేయటంలో తల్లిగా నా పాత్రను నేను కూడా నిర్వహించేశాను.

ప్రపంచానికి మాత్రం చక్కని భార్యాభర్తలుగా కనిపిస్తూ ఒక కొడుకుని కనేశాము. ఒకే సంతానం, అది కూడా కొడుకైతే మా ప్రేమను మొత్తం వాడికి మాత్రమే అందించగలుగుతాము అనే పిచ్చిపిచ్చి ఆలోచనలతో నన్ను అడగకుండానే ఆయన పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుని వచ్చి పడుకున్న మా వారిని ఆయన శ్రేయోభిలాషులు పలకరించ వచ్చి ఇలా అన్నారట-

"అరె..వాసుగారూ! ఇలా ఎలా ఆపరేషన్ చేయించుకున్నారు? ఒక్క బిడ్డ బిడ్డే కాదు! ఒక్క కన్ను కన్నే కాదు' అన్న నానుడి మీరు విన లేదా?' అని ఆయనకు తమ మాటలతో తలంటు పోశారట.

తట్టుకోలేని మా వారు- భోజనం కూడా చేయకుండా మూడంకె వేసి ముసుగు తన్ని పడుకుంటే ఏమీ చేయలేక అభోజనంగా పడుకోవలసి వచ్చింది. ఇలా మా ఒక్కగానొక్క కొడుకైతే మా ప్రేమ నంతా వాడికే మాటలతోనూ మూటలతోనూ అందించవచ్చును గదా అనుకుంటే..

ఇంతకూ ఈ నా ఆలోచనల జోరీగ రొదలో పడి మీకు అసలు విషయం చెప్పలేదు కదూ! ఆ ఆపరేషన్ నాటి నుండి నేడు తాతగా ప్రమోషన్‌గా పొందినప్పటికీ మా వారు కొడుకును ఎక్కడ దూరంగా పోగొట్టుకుంటానో అనే భయంతో పగలు, రాత్రి పీడ కలలు కనటం, కలవరించుతూ నిద్రలో కూడా భయపడి పోవటం మాన లేదని నేను చెప్తే మీకు అతిశయోక్తి గానే అనిపిస్తుంది.

అయ్యో! ఇంత చెప్పిన నేను ఈ కథకూ నా ఇంటికీ కథా నాయకుణ్ణి మీకు పరిచయమే చేయకపోవటం క్షమార్హం కాదు కదా! ఆదిత్య... ఒక్కడే ముద్దు ఇంకొకరు వద్దు అనుకుని ప్రాణాలన్నీ వాడిపైనే పెట్టుకుని పెంచిన నా ఆశల వారధి. మీరు పెంచినంత గొప్పగా ఎవరూ పెంచలేరు కరుణ గారు... కొంతమంది ఫ్యామిలీ ఫ్రెండ్స్ ఇలా అంటుంటే మురిసి ముక్కలైన ఆనందం ఏది? ఈనాడు నేను తల్లిగా, గురువుగా గెలిచానా? ఓడానా??

"అమ్మా! నన్ను చిన్నప్పుడు ఎక్కడో ఒక మూల పడుకోబెట్టేసి ఏడ్చినా పట్టించుకోకుండా ట్యూషన్లు చెప్పుకుంటుంటే నేనే ఎలాగో పెరిగి పెద్దగా అయ్యుంటాను కదా!' ఆదిత్య మాటలకు మనసు ముక్క చెక్కలై విలవిలలాడుతూ ఎంత వ్యథననుభవించి రోదించిందో నాకు మాత్రమే తెలుసు.

నన్ను నీ ట్యూషన్ పిల్లల ముందు కొట్టి, తిట్టి చదివించి డాక్టర్‌ని చేసి ఏమి సాధించావో నాకైతే తెలియదు. బయటి వాళ్ళ పిల్లల మీద చూపిన ప్రేమని నాపైన ఒక్కసారైనా చూపించలేదు నీవు. ఇలాంటి ఈటెలు వాడొక్కడే ఉపయోగించగలడు. అందుకే నాపైన డైరెక్ట్‌గా ప్రయోగించాడు, ప్రయోగిస్తున్నాడు. ప్రయోగిస్తాడు భవి ష్యత్తులో. ఇంతకూ నేను గెలిచానా? ఓడానా!! తల్లిగా, గురువుగా వాడ్ని చదివించి, డాక్టరుగా చేసుకుని... చూసుకుని?..

వాడికి లెక్కలంటే ఉన్న అయిష్టంతో వాడు బైపిసి గ్రూప్ ఎంచు కున్నప్పుడు మావారు అన్న మాటలు ఈ రోజుకు కూడా నేను మరవలేకపోతున్నాను. ఎంపిసి చదివి ఇంజనీర్‌గా లైఫ్‌ను ఎంజాయ్ చేయవచ్చురా.. బైపిపి చదివి డాక్టర్‌గా సెటిల్ అవ్వాలంటే చాలా టైమ్ పడుతుందిరా" అంటూ ఆయన ఎంత చెప్పినా వినకపోతే

మరో చిన్నపాటి ట్రాక్ ద్వారా ఆయన తన కొడుకుని ఇంజనీరింగ్ కోసం ఎంపిసిలోనే బలవంతంగా చేర్పించినప్పటికీ వాడు రెండు నెలల తర్వాత కూడా సెట్ కాలేదు ఒక కార్పొరేట్ పరుగుల కళాశాలలో.

ఒకరోజు ల్యాండ్ ఫోన్ మోసుకొచ్చిన కబురు అర్జెంట్‌గా బయలు దేరండి. వచ్చి మీ అబ్బాయి విషయంలో మాట్లాడుకోండి... అన్న సారాంశంతో వెళ్ళి వాళ్ళ కాలేజీలో చేతులు కట్టుకుని నిలబడ్డాం మేమే తప్పుచేసిన వాళ్ళలాగా. ఇష్టంలేని గ్రూప్‌లో జాయిన్ చేసి వెళ్ళారని కోపంతో రెండు నెలలైనా తాను కాంప్రమైజ్ అయి చదువు కోవటం లేదు. రెండు రోజుల నుంచి తిండి కూడా మానేసి ఇంటికి వెళ్ళిపోతానని గొడవ చేస్తున్నాడు. చెప్పేసి చేతులు, మనస్సు దులుపుకున్నారు ప్రిన్సిపాల్‌గారు. పిడుగు పాటుకు మ్రాన్పడి నెమ్మదిగా ప్రిన్సిపాల్ గారిని అడిగితే చెప్పారు- “అడ్మిషన్ ప్రోగ్రామ్ క్లోజ్ చేశారు. ఈ ఇయర్ ఏ విధమైన అవకాశాలు ఉండవు” అంటూ.

ఎన్నో మొరలు పెట్టుకున్న తర్వాత ఏ దైవమో కరుణించి రెండు సంవత్సరాల ఫీజులు, మెస్ ఫీజులు, అన్ని ఫీజులు కడితే నేను చేయకలిగిన సహాయం చేసి టిసి చేతికిస్తానన్న ప్రిన్సిపాల్ వరాల మాటలు మాకు వినిపించాకా ఆ ఫీజులన్నీ చెల్లించుకుని టీసీ తీసుకెళ్ళి వేరే కళాశాల వారి కాళ్ళు, గడ్డాలు పట్టుకుని బైపిసిలో జాయిన్ చేసి, అప్పటికే అయిపోయిన రెండు నెలల సిలబస్ ప్రతి ఆదివారం వెళ్ళి లాడ్జిలో వాడికి నూరిపోసిన నేను గెలిచానా? ఓడానా??

“అమ్మా! రేపు ఎంసెట్ ఎంట్రెన్స్ కదా! నేను ఎగ్జామ్ బాగానే వ్రాశాను అని ఫోన్ చేసేవరకు నా కోసం పూజ చేస్తూ ఉపవాసం ఉండి గుడిలోనే ఉండు' అని ఫోన్ చేసి ఆర్డర్స్ వేసిన రోజులు వాడి నోటీస్‌లోనే లేవు మరి.

వాడి ఆర్డర్‌ను వినగానే నా ఉద్యోగానికి లీవ్ పెట్టి మరీ దైవ సన్నిధిలో కూర్చుని చేసుకున్న ఒకే ఒక విన్నపము- ఆ దైవానికి ఖచ్చితంగా గుర్తుంటుంది.

“నా కొడుకును సేవాభావం కల డాక్టర్‌గా చేయి దైవమా.. అని ప్రార్థించిన రోజులు వాడి మేథస్సులో సేవ్ కానేకాలేదు.

ఇంకా లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్తే నీకు మంచి ర్యాంక్ వస్తుంది అని వాడి నాన్నగారు చెప్పిన మంచి మాటకు స్పందించక ఒప్పుకోక మాకు కలిగించిన బాధను తట్టుకుని ‘మావారి కాళ్ళకు నమస్క రించి, మన ఒక్కగానొక్క కొడుకుని డాక్టర్‌గా చేసి చూసుకుందాం. ఎంత ఖర్చైనా. నేను మిమ్మల్ని ఇంతకంటే ఏమీ అడగను. కోరుకోను. అని దేహీ అని అడిగిన విషయం వాడికి ఈనాడు అస్సలు లెక్కలోని విషయమేకాదు. వాడి జ్ఞాపకాల పందిరిలో అది కాయని కాయగానో, పూయని పూవుగానో మిగిలిపోయింది.

ఇన్ని విజ్ఞాపనలు, విన్నపాలు భగవంతుడు మాత్రం వినకుండా ఎలా ఉంటాడు? విన్నాడు... వాడి తండ్రి రూపంలో వాడిని ఒక ప్రఖ్యాత మెడికల్ కాలేజీలో మెడికోగా జాయిన్ చేసి నీ కోరిక తీర్చాను. ఇంక వాడు బాగా చదివి మన కోరిక తీర్చి సేవాభావం గల వైద్యుడిగా అవతరించి మనల్ని సంతోషపెట్టాలి- అన్నారు నాతో ఆయన.

ఇక్కడితో కథ ముగిస్తే నేను ప్రశ్నించే అవసరమే ఉండేది కాదు. నేను గెలిచానా? ఓడానా?? అని.

ఇక్కడ్నుంచి కథ మరో మలుపు, మరో మలుపు, ఎన్నో మలుపులు తిరిగింది.

మధ్యతరగతి మనుషులం. పిల్లలను డాక్టర్లను, ఇంజనీర్లను చేయడం, కార్పొరేట్ కాలేజీల మాయాజాలంలో పడిపోవటం అందర్నీ నమ్మడం, విలువలను వదులుకోలేకపోవడం, బోర్లాపడి పోవడం ఇన్ని ఇన్సిడెంట్‌ల మధ్య జీవితాలు నలిగిపోతున్న వేళ మెడికోస్ సంస్కృతి ప్రకారం వాళ్ళు ప్రేమ అనుకుంటున్న ఆకర్షణలో పడిపోవడం, బయటకు రావడాలలోనే చదువు ముగించి ఇంటర్న్‌షిప్ కోసం, పీజి కోసం బయట ఉండి కష్టపడు తున్న సమయాలలో ఒక పరభాషా సహోద్యోగి జిలుగు వెలుగు లకు ఆకర్షణలో చిక్కుకుని గిలగిలలాడుతున్నప్పుడు కూడా- ఒక్కడే సంతానం చాలు అనుకుని వాడికి అన్నీ ఇవ్వగలగాలి. కోరికలు అన్నీ తీర్చగలగాలి అనుకుంటూ అన్నీ తీర్చాము. ఇప్పుడు వాడి వివాహ విషయంలో కోరుకున్న అమ్మాయితో చేసి వాళ్ళు సంతోషంగా ఉంటే చూసి మనం సంతోషించవచ్చునేమో కదా అనుకుంటూ మేమిద్దరం కూడబలుక్కుని మనసులకు సర్ది చెప్పుకుని తన పెళ్ళి తాను కోరుకున్న అమ్మాయితోనే చాలా గ్రాండ్‌గా ఇరు ఖర్చులు భరించి చేశాం.

కొంత వెసులుబాటు తర్వాత చక్కని పొదరిల్లులాంటి అపార్ట్‌మెంట్ మా పొదుపు మొత్తంతో కొని వాళ్ళని గృహ ప్రవేశం చేయించి అత్యంత ఆనందాన్ని మనస్సుల నిండా మూటకట్టుకున్నాం అనే పిచ్చిలో పడిపోయాం.

“అమ్మా! నీవు నా కొడుక్కి భయపెట్టి, బాధపెట్టి, హాస్టల్ అనే బూచిని చూపిస్తూ చదువు చెప్పవద్దు. వాడిని నాలాగా డాక్టర్‌ని చేసి కష్టపెట్టేసి ఏమీ సాధించనక్కరలేదు. నేడు ఓలా క్యాబ్‌డ్రైవర్‌లు కూడా లక్షలు సంపాదించగలుగుతున్నారు. నేను వాడిని నీలా చదివించదలుచుకోలేదు అంటూ నా కొడుకు నాకు చేసిన ఉపదేశం ఈ కథకు మూలం అని ఇంత ఆలస్యంగా చెప్పటం, నా ఈ ప్రశ్నకు మూలం అని చెప్పటం, నేను గెలిచానా? ఓడానా అని ప్రశ్నించటం వెనుక ఉన్న గతంలో నుంచి బయటపడి మా ఆదిత్య మాటలకు సమాధానంగా ఇలా అన్నాను.

“ఒక్కగానొక్క మనవడిని హోమ్‌వర్క్ చేయించుతున్నానురా అంతే!' లేదు లేదు నేను సీసీ కెమెరాలలో చూస్తూనే ఉన్నాను. వాడిని హింసించి చదివించే అవసరమే లేదు. ఇద్దరూ ఒక్కటే పద్ధతి. వాడిని సాయంత్రం కిందికి తీసుకువెళ్ళి ఆడించుకుని రండి.. చాలు” అన్నాడు చాలా కోపంగా.

ఇప్పటి పోటీ ప్రపంచంలో చదువుకోకపోతే మనవడు ఎలా బ్రతుకగలుగుతాడు అనేది మా బాధ అంతే నాన్నా..- నా వివరణ.

“మీరు చదివించేసి వాడిని నాలాగా తయారు చేయక్కరలేదు. వాడు నా కొడుకు. బయటికి తీసుకెళ్ళి ఆడించలేకపోతే కంటినిండా నిద్రపోనివ్వండి” పడుకోబెట్టండి మేము వచ్చేవరకు.

మరి హోమ్‌వర్క్ చేయకపోతే రేపు డెయిరీలో మెసేజ్ వస్తుంది కదా! నేను కలిగించుకుని చెప్పబోయేలోగా మావారు చెప్పనే

చెప్పారు. 'పండిత పుత్రః పరమ.. అన్నట్టు డాక్టర్ గారి అబ్బాయి హోమ్‌వర్క్ రాసుకు వెళ్ళకపోతే ఎలా? అన్నారు వాళ్ళ నాన్నగారు.

నా మనసు మళ్ళీ ఆలోచనల్లోకి వెళ్ళిపోయింది. అడ్డాలనాడే బిడ్డలకు అన్నీ నేర్పించాలనే తాపత్రయంతో, వాళ్ళకు ఎన్నో ఆశలతో, ఆశయాలతో తామే అన్నీ కష్టపడి నేర్పించేసి సూపర్ కిడ్స్‌గాను, సూపర్ చాంప్స్‌గాను తయారు చేసిన తల్లిదండ్రులు అందరూ ఇలాంటి పిచ్చోళ్ళేనా వాళ్ళ పిల్లల దృష్టిలో? హింసించి, కొట్టి, తిట్టి సూపర్ కిడ్స్‌ను తయారు చేశామా మా తరం? ఒక్కరినే కని, ఒక్కరికీ ప్రేమను పంచి ఒక్కరిమీదే తల్లిదండ్రుల ఇద్దరి ఆశలు, ఆశయాలు పెట్టుకుని, వారికి ఏ లోటూ రాకుండా పెంచడం మన తప్పా? అదీ పెద్ద హింస అని వారి కిడ్స్ అనుకునేవిధంగా తల్లిదండ్రుల ప్రేమను 'హింస' అనే పేరుతో పదేపదే తల్లిదండ్రులని మానసికంగా హింసించటం కోరుకున్నానా?

ఇలాంటి ఆలోచనల్లో నలుగుతున్న నాకు కోడలు రావడం, వాళ్ళ పుత్రరత్నం తల్లి కాళ్ళకు చుట్టుకుపోతూ వాడు అన్న మాటలు నన్ను ఈ లోకంలోకి తెచ్చాయి.

"అమ్మా! డాడీ! నానీ తాతయ్యకు చెప్పండి. నన్ను వ్రాయమనవద్దని. ఐ డోంట్ లైక్ టు రైట్. నన్ను ఆడించమనండి, లేకపోతే నేను వాళ్ళతో మాట్లాడను' అంటూ అమ్మ కాళ్ళకు చుట్టుకుపోయి గారాబాలు పోతూ చెప్పాడు మా ఆరుష్.

'అష్టరాల్ వాడింకా స్మాల్ కిడ్ అమ్మా! స్కూల్ వాళ్ళు ఇంత హోమ్ వర్క్ ఇవ్వడం ఏంటి?" కోడలు బాధపడిపోతూ "ఆరుష్! సిట్ అండ్ వాచ్ టీవీ' అని టీవీ ముందు కూర్చొబెట్టి రిమోట్ చేతిలో పెట్టి రెస్ట్ పేరుతో తనరూమ్‌లోకి వెళ్ళి భళ్ళున తలుపు మూసుకుంది.

వాళ్ళిద్దరూ ఉద్యోగులు కదా! ఆదివారం తప్ప సెలవు దొరకటమే వాళ్ళకు గగన కుసుమం. వాళ్ళ డ్యూటీలు చేసి అలసిసొలసి వచ్చి వాళ్లు విశ్రాంతి తీసుకుంటుంటే మరి మా ఆరుష్ కూడా చదువుకుంటేనే కదా డ్యూటీ వస్తుంది. డ్యూటీ వస్తేనే కదా డబ్బులు వస్తాయి. రేపు వాడి తల్లిదండ్రులను చక్కగా చూసుకోగలిగేది? అని ఆ చిన్ని బుర్రకి అర్థం అయ్యేలా చెప్పడం 'హింస'గా అనిపిస్తుందా?

చదువు, విజ్ఞానం, విలువలని పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది. వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది చదువే అని చెప్పటానికి నా కొడుకు, కోడలు రెడీగా లేరు. నిన్నటి తరానికి చెందిన తాత, నాన్నమ్మలుగా మేము చేసే ప్రయత్నం వాళ్ళకి 'హింస'గా ఎలా కన్పించింది? వీళ్ళు చదువుకుని, ఉద్యోగాలు చేసుకుని, ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుని పిల్లలను ఆ భయంకరమైన టీవీలకు, రిమోట్లతోపాటు వదిలేస్తే వారి భవితవ్యం మాటేమిటి? వాళ్ళ పెరుగుదలకు, రేపటి వారి వ్యక్తిత్వ నిర్మాణానికి మంచి విలువలతో కూడిన విద్య వద్దా?

మొక్కై వంగనిది మానై వంగుతుందా? వాళ్ళు చదువుకున్న ఎంతో విలువైన విద్యతో రేపటి తరానికి తల్లిదండ్రులుగా వారు మార్గదర్శకులు కావద్దా?

చివరికి నాకనిపించింది ఏమిటంటే వాళ్ళ పిల్లల పెంపకానికి వాళ్లు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలంత మాత్రం కూడా మేము పనికిరామా? అని.

ఎక్కడ జరిగింది? మా పెంపకంలో లోపం. ఎందుకు ఇలా మారిపోయారు వీళ్ళు? ఎలా సరిదిద్దాలి వీళ్ళ ఆలోచనల్ని? నా ఆలోచనలు ఇలా పరిపరి విధాల పోతున్నప్పుడు కోడలు కృతి వచ్చి ఇలా అన్నది.. ఈ రోజు సర్వెంట్ తన ఇంటికి వెళ్ళింది ఆంటీ. నేను వండలేను. బయట భోంచేసి వస్తాం అంటూ 'కమ్ ఆరుష్! లెట్స్ గో అండ్ ఈట్' అంటూ వాడ్ని తీసుకుని రాత్రి 10-30కు భోజనాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయారు.

ఉద్యోగం చేసినంతలో ఇంట్లో వంట చేయడం, ఇంటి పని చేసుకోవడం తప్పుగా భావిస్తుంది కోడలు కృతి.

"అమ్మా కృతి! ఇంట్లో తయారు చేసుకుని భోజనం చేసి చూడండి. రుచికి రుచి. ఆరోగ్యానికి ఆరోగ్యం కదా? మీకు ఏ స్విమ్మింగ్ కూడా అవసరం ఉండదు స్లిమ్మింగ్‌కి" అన్నానొక రోజు సరదాగా.

అలా చెప్పద్దు ఆంటీ. అలాంటి సర్వెంట్ పనులు నా వల్లకాదు. డబ్బులు పడేసి చేయించుకుంటున్నాను. మీ అబ్బాయికి వినిపిస్తే రేపటి నుంచి స్విమ్మింగ్‌కి వెళ్ళవద్దంటారు. అయినా ఇద్దరం వర్కింగ్ కదా! మా లైఫ్‌స్టైల్ వేరు కదా! అంటుంది మా కృతి తన ప్రత్యేక తరహా ఇంగ్లీష్‌లో.

కరక్టే! కాని నేను, నా భర్త ఇద్దరం వర్కింగే కదా! అన్నీ చాలా పద్ధతిగా అమర్చిపెట్టినా, చుట్టాలు ఉన్నప్పుడు ఇంకా త్వరగా లేచి వంటావార్పు చేసి కాలేజీకి వెళ్ళేదాన్ని. సాయంత్రం మళ్ళీ వచ్చాక నా ఇంటి పని నేనే చక్కబెట్టుకునేదాన్ని కదా!

నేను, నా పెంపకంలో వాడ్ని వాడు కోరుకున్న డాక్టర్‌గా సంఘంలో నిలబెట్టడానికి నేనే వాడి పర్సనల్ గురువుగా, టీచర్‌గా, వాడి అమ్మగా, వాడికి సలహాదారుగా మారి అన్ని పాత్రలను చక్కగా నిర్వహించి వాడిని ఒక గొప్ప డాక్టర్‌గా, సేవాభావం గల డాక్టర్‌గా తయారు చేయగలిగాను. నా భర్త సాయంతో అనే సంతృప్తిని నాకు లేకుండా చేశాడు. జీవితం మొత్తం నా కొడుకు, వాడి చదువు, వాడి వ్యక్తిత్వ నిర్మాణం గురించి ఆలోచించి, అమలుచేసి, ఇప్పుడు వాడి కుటుంబం కూడా బాగుండాలనుకోవడం, వాళ్ళకు అవసరమైన చోట కొన్నికొన్ని విలువలతో కూడిన కుటుంబాన్ని తయారు చేయాలని ఆశలను నాటి పాదు చేసి నీరుపోసి పెంచాలనుకోవడం, రేపటి తరాన్ని మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దాలనుకోవడం ఎంతవరకు తప్పో నాకర్థం కావడంలేదు.

వంటనూ, జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని కాదనుకోవడం, అవి అవసరం లేదనుకోవడం, డబ్బులిచ్చి చేయించుకోగలను అనుకోవడం మా కృతి ఆలోచనల దిశ, దెస ఎటు తీసుకెళ్తుందో కదా! రేపటి తరానికి అందించాలి, తప్పదు. కాని వాటికి అనువైన పద్ధతులను ఎన్నుకుని పెద్దలుగా మన ప్రయత్నం మనం చేస్తూనే ఉండాలి. గెలుపోటములు మన జీవిత ప్రయాణాల్లో వచ్చిపోయే అతిథులు మాత్రమే అనుకోవాలి. హమ్మయ్య ఇప్పుడు నేను గెలుస్తాను అనుకున్నాను.

✤




ముహమ్మద్ వహీదుద్దీన్

**ఒకసారి** మహాప్రవక్త ముహమ్మద్(స) తన సహచరులందరినీ మస్జిద్‌లోని ఉపన్యాస పీఠం (మింబర్) సమీపానికి రమ్మని ఆజ్ఞాపించారు. మేమందరం పీఠం దగ్గరకు వెళ్లి కూర్చున్నాం. మహాప్రవక్త(స) ఉపన్యసించేందుకు మింబర్ మొదటి మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి ఆమీన్ అని పలికారు. ఆ తర్వాత రెండవ మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి ఆమీన్ అని చెప్పారు. అదేవిధంగా మూడవ మెట్టుపై తమ పవిత్ర పాదాన్ని పెట్టి ఆమీన్ అన్నారు. ఆ తర్వాత మా వైపు తిరిగి ధర్మోపదేశం చేశారు. ఉపన్యసించిన తర్వాత మింబర్ నుండి క్రిందికి దిగి వచ్చారు.

అప్పుడు మేమందరం మహాప్రవక్త(స)తో ఇలా విన్నవించుకున్నాము : మహనీయ ప్రవక్తా(స)! తమరు మింబర్‌పై ఎక్కుతున్నప్పుడు 'ఆమీన్' అని మూడుసార్లు పలికారు. ఇలా తమరు ఇంతకు ముందెప్పుడూ పలకలేదు. దయచేసి వివరించగలరా?' అని మా ప్రశ్నకు జవాబుగా మహాప్రవక్త(స) ఇలా వివరించారు : ఆ సమయంలో హజ్రత్ జిబ్రయీల్ (అలై) నా వద్దకు వచ్చి నా పాదం మొదటి మెట్టుపై ఉన్నప్పుడు ఇలా శపించారు. "ఓ అల్లాహ్! రమజాన్ పవిత్ర మాసాన్ని పొంది కూడా క్షమాపణ పొందని మానవుడిని నీవు నాశనం చేయి" ఈ వాక్యాలు విన్న నేను 'ఆమీన్' అని పలికాను.

రెండవ మెట్టుపై పాదాన్ని మోపుతుండగా మరలా హజ్రత్ జిబ్రయీల్(అలై) (దైవదూతల నాయకుడు) ఇలా శపించారు. 'హజ్రత్ ముహమ్మద్(స) నామాన్ని తన ఎదుట పలుకుతున్నప్పుడు ఆ పేరు వినగానే 'దురూదె షరీఫ్'ను పఠించని వాడు నాశనమవుగాక! ఈ వాక్యాలు విన్న నేను 'ఆమీన్' అని పలికాను.

మూడవ మెట్టుపై పాదాన్ని మోపుతుండగా మరలా హజ్రత్ జిబ్రాయీల్(అలై) ఇలా శపించారు : 'తన తల్లిదండ్రులు జీవించి యున్న కాలంలో వారికి సేవలు చేసి వారి దీవెనలు పొందక స్వర్గ ప్రవేశానికి అర్హత సంపాదించుకోని వాడు నశించుగాక' అని పలకగా నేను "ఆమీన్" అని పలికాను.

ఈ హదీసులో జిబ్రాయీల్(అలై) మూడు శాపాలున్నాయి. ఈ మూడు శాపాలకు మహాప్రవక్త ముహమ్మద్(స) 'ఆమీన్' (అలాగే జరుగుగాక!) అని పలికారు.

ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, హజ్రత్ జిబ్రాయీల్(అలై) దైవదూతల నాయకులు. అల్లాహ్ నుండి మహాప్రవక్త(స)కు దైవగ్రంథాన్ని వహీ (దైవాజ్ఞ) ద్వారా అందించినట్టి ప్రముఖులు. కాబట్టి వారి శాపం సామాన్యమైనది కాదు. అలాగే ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ గారి ఆమీన్ సాధారణమైన ఆమీన్ కాదు. దైవం ఇలాంటి శాపాల నుండి ప్రజానీకాన్ని రక్షించుగాక! ✤




# అంగన్ వాడీ

**హుమేరా అమీర్, ఏలూరు**

భారత దేశంలోని పేద బాల బాలికలకు, గర్భవతులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో, పిల్లల ఆకలి మరియు పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడానికి సమీకృత శిశు అభివృద్ధి సేవల పథకంలో భాగంగా 1975లో భారత ప్రభుత్వము, అంగన్ వాడీ కేంద్రాల వ్యవస్థను ప్రవేశ పెట్టింది. అంగన్వాడీ అనేది భారతదేశంలోని ఒక రకమైన గ్రామీణ శిశు సంరక్షణ కేంద్రం.

ఒక సాధారణ అంగన్వాడీ కేంద్రం ఒక గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందిస్తుంది. ఇది భారతీయ ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థలో ఒక భాగం. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యకలాపాలలో గర్భనిరోధక సలహాలు, పోషకాహార విద్య, అలాగే ప్రీ-స్కూల్ కార్యకలాపాలు అన్నీ ఉంటాయి. 31 జనవరి 2013 నాటికి, సుమారు 13.3 లక్షలు అంగన్వాడీ, మినీ-అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాలు సప్లిమెంటరీ న్యూట్రిషన్, నాన్-ఫార్మల్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ మరియు హెల్త్ ఎడ్యుకేషన్, ఇమ్యునైజేషన్, హెల్త్ చెకప్, రిఫరల్ సేవలను అందిస్తాయి, వీటిలో చివరి మూడు ప్రజారోగ్య వ్యవస్థలకు అనుగుణంగా అందించబడతాయి.

భారతదేశంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. 2020లో WHO సిఫార్సు చేసిన వైద్యుల జనాభా నిష్పత్తి 1:1000. కానీ మన దేశంలో ఆ స్థాయిలో వైద్యులు లేరు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా, దేశం స్థానిక జనాభాకు సరసమైన, అందుబాటులో ఉన్న ఆరోగ్య సంరక్షణను అందించాలనే దాని లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఒక ప్రాంతంలో నివసిస్తున్న వారి స్థానిక ఆరోగ్య స్థితిపై వైద్యుల కంటే అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన ఎక్కువగా ఉంటుంది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఒక లక్ష నాలుగు వేలమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు. నవజాత శిశువుల కోసం సంరక్షణ అందించడానికి, 6 సంవత్స రాల లోపు వయసు గల పిల్లలకు రోగ నిరోధకాలు నిర్ధారించ డానికి, బాలింతలు, గర్భిణీలకు ఆరోగ్య అవగాహన కలిగిం చడం, వీరందరికీ పోషకాహారం అందించడం వంటివన్నీ అంగన్ వాడీల ముఖ్య విధులు. వీరు రోగ నిరోధకత ప్రచారంలో వైద్యు లకు సహాయం చేస్తారు. సంబంధిత వ్యక్తుల లేదా రోగుల వివరాలను రికార్డులలో భద్రపరచడం. పునరుత్పత్తికి సంబం ధించి గర్భిణులకు అవగాహన కల్పించడం, అవసరమైన వారికి మందులు, మందుల కిట్‌లను అందించడం. పరిశుభ్రత, వ్యాధులు మొదలైన వాటిపై ప్రజలలో అవగాహన కల్పిం చడం. పిల్లలకు ప్రీస్కూల్ కార్యకలాపాలను నిర్వహిం చడం అంటే చిన్నారులను ఆటపాటలతో ఆడిస్తూ, వారికి చదువు చెప్పడం, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారం వండి వడ్డిం చడం, బాలింతలకు విడతలవారీగా పౌష్టికాహారం అందించడం, తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తల గురించి సూచనలు ఇవ్వడం, అలాగే పుట్టిన బిడ్డకు ఎప్పటికప్పుడు వారి బరువును చూసి సరైన పౌష్టికాహారం అందించడం మొదలైన విధులు అంగన్‌వాడీల ద్వారా నిర్వర్తిస్తూ ఉంటారు.

చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సమీప అంగన్ వాడీ కేంద్రాల నుండి సరఫరా చేసే పోషకాహారం- చిన్నారులకు ప్రతి నెల 25గుడ్లు, బాలామృతం 2.5 కేజీలు, పాలు 2.5 లీటర్లు అందిస్తారు. బాలింతలకు, గర్భిణులకు కిట్లు పేరుతో పోషకా హారం అందిస్తారు. వీటిలో కందిపప్పు 1 కిలో, బియ్యం 5 కేజీలు, పాల డబ్బాలు 5 లీటర్లు, 25 గుడ్లు, ఒక ప్యాకెట్ ఖర్జూరం, చిక్కీలు 1/4 కేజీ, బెల్లం 1/4 కేజీ, అటుకులు కేజీ, రాగిపిండి 2 కేజీలు, నూనె 1/2 లీటరు ఉంటాయి. మన రాష్ట్రంలోని 55,000 కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు సంరక్షణ, సహాయాన్ని అందించడంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

అంగన్ వాడీ కేంద్రాల సిబ్బందికి చెల్లించే గౌరవ వేతనాలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వారి వారి వాటా నిష్పత్తులను అనుసరించి చెల్లిస్తాయి. సవరించిన వేతనాల ప్రకారం 01.07. 2019 నుండి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కొక్క అంగన్‌వాడీ కార్యకర్తకు నెలకు రూ.11,500/, అంగన్‌వాడీ సహాయకులకు నెలకు రూ.7,000/ చెల్లిస్తున్నారు. ఈ అంగన్‌వాడీలలో సిబ్బంది కార్యకర్త, సహాయకుల విధులు వేరువేరుగా ఉంటాయి.

**అంగన్వాడీ కార్యకర్తల విధులు, బాధ్యతలు :** పోషన్ 2.0ను నిర్వర్తిం చడానికి తన వంతు పాత్ర పోషించడం, అంగన్వాడీ కేంద్రానికి అందజేయబడిన స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి, పనిలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలి. లబ్ధిదారుల వివరాలన్నీ ఎప్పటికప్పుడు Poshan Tracker Appలో ఫీడ్ చేసి ఎప్పటి కప్పుడు రిపోర్ట్‌ను సంబంధిత అధికారికి అందించాలి. అంగన్ వాడీ కేంద్రంలో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్క బాలబాలికల బరు వును ప్రతి నెల చెక్ చేసి, గ్రాఫిక్ గ్రోత్ కార్డు తయారు చేయాలి. అలాగే తల్లీ/పిల్లలను సంబంధిత PHC/ సబ్ సెంటర్‌లకు పంపించేందుకు రిఫెరల్ కార్డులను తయారు చేయాలి. 6 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు చైల్డ్ కార్డులను మెయింటైన్ చేయాలి. సంబంధిత వైద్య, పారామెడికల్ సిబ్బంది సందర్శించినప్పుడు, ఈ కార్డులను వారికి చూపించ వలసి ఉంటుంది. సంవత్సరానికి కనీసం ఒక్కసారి అయినా తల్లీ/పిల్లల గురించి సర్వే నిర్వహించాలి. పూర్వ పాఠశాల కార్య కలాపాలు నిర్వహిస్తూ పిల్లలకు చిన్న చిన్న బొమ్మలు తయారు చేయడం నేర్పిస్తూ మరియు వారికి ఆటపాటల్లో సహాయం చేయాలి. పరిసర ప్రాంతాల్లో దొరికే పోషక విలువలు కలిగిన ఆహార సామగ్రితో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు కావలసిన పోషకాహారాన్ని తయారు చేసి అందించడం. ఆరోగ్య, పోషకాహార విద్యను తల్లులకు నేర్పించడం, తల్లిపాల పోషకాల గురించి, బిడ్డకు తల్లిపాల ఆవశ్యకత గురించి, కుటుంబ నియం త్రణ గురించి స్త్రీలలో అవగాహన కల్పించడం. పుట్టబోయే పిల్లల జనన రిజిస్ట్రేషన్ గురించి ముందుగానే గర్భవతులకు అవగాహన కల్పించడం.

నవజాత శిశువులకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వారి పెరుగుదల అభివృద్ధికి సమర్ధవంతంగా ప్రణాళికలు వేసుకునే విధంగా వారి ఇంటికి వెళ్లి తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తారు. బిడ్డ పుట్టక పూర్వం మరియు బిడ్డ పుట్టిన తర్వాత నిర్వహించే ఆరోగ్య తనిఖీ, రోగనిరోధక కార్యక్రమాలలో సంబంధిత ఏరియా PHC స్టాఫ్ కు సహాయం చేస్తారు. పోషన్ 2.0 స్కీం క్రింద ఆరోగ్య సంరక్షణ సేవలు, రికార్డుల నిర్వహణలో నేషనల్ హెల్త్ మిషన్ క్రింద గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్త (ASHA) లకు దిశానిర్దేశం చేయడం. కౌమార బాలికలకు నిర్దేశించిన కేంద్ర, రాష్ట్ర పథకాలను అమలు చేయడం, సంబంధిత రికార్డులను తయారుచేసి, భద్రపరచడం. అలాగే ఇంటింటికీ పర్యటించి నప్పుడు ఆ ఇంటిలో ఎవరైనా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు ఉంటే గుర్తించి వెంటనే వారిని సంబంధిత PHCకి రిఫర్ చేసి, పంపించాలి. కరోనా, డయేరియా, కలరా మొదలైన వ్యాధులను గుర్తిస్తే వెంటనే సంబంధిత ANMకు తెలియజేయాలి. పల్స్ పోలియో కార్యక్రమాలలోను, చిన్న పిల్లల్లో షుగర్ ఉంటే వారిని గుర్తించడంలోనూ ANMకు సహాయం చేయాలి. RCH కిట్, గర్భనిరోధకాలు మొదలైన వారికి డిపో మేనేజర్‌గా పని చేయ

వలసి ఉంటుంది. పరిస్థితులను బట్టి భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అంగన్వాడీ, పోషన్ 2.0కు సంబంధించిన ఏ పని అయినా చేయడానికి అంగన్వాడీ కార్యకర్త సిద్ధంగా ఉండాలి.

అంగన్వాడీ సహాయకుల విధులు, బాధ్యతలు: లబ్ధిదారులకు ఆహారాన్ని వండి, వడ్డించడం, అంగన్ వాడీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నీటిని అందుబాటులో ఉంచడం, అంగన్ వాడీ కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలను పరిశుభ్రంగా ఉంచడం, చిన్న పిల్లలను గ్రామం నుండి అంగన్ వాడీ కేంద్రానికి తీసుకురావడం, విధులను సక్రమంగా నిర్వర్తించేందుకు కార్యకర్తకు సహాయం చేయడం మరియు ఒకవేళ సదరు అంగన్ వాడీ కేంద్రంలో కార్యకర్త లేనట్లయితే ఆమె స్థానంలో సహాయకురాలే కార్యకర్త పాత్ర పోషించి, విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో అంగన్ వాడీ కార్యకర్తలు గానీ, అంగన్ వాడీ సహాయకులు గానీ కీలకమైన పాత్ర పోషిస్తున్నారనే చెప్పాలి. బాలల మరియు గర్భిణులు, బాలింతల సంరక్షణ అనేది నిరంతరం నిర్వర్తించవలసిన బాధ్యత. వీరు తమ బాధ్యతలను అత్యంత సమర్థవంతమైన రీతిలో నిర్వహించడం చాలా అవసరం.

అంగన్వాడీలలో పనిచేసే అధికారులు మరియు వారి సహాయకులు సాధారణంగా పేద కుటుంబాలకు చెందిన మహిళలు. అంగన్వాడీ కార్మికులకు ఇతర ప్రభుత్వ సిబ్బంది వలె సమగ్ర పదవీ విరమణ ప్రయోజనాలతో శాశ్వత ఉద్యోగాలు లేవు. అంగన్వాడీ-సేవలో ఉన్న పిల్లలు అనారోగ్యం పాలైనప్పుడు లేదా మరణించినప్పుడు చట్టపరమైన మరియు సామాజిక సమస్యలు అంగన్వాడీ కార్మికులను వెంటాడుతున్నాయి. 2022 బడ్జెట్‌ను ప్రకటించినప్పుడు, అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అంగన్వాడీ వర్కర్లకు నెలకు రూ.20,105, హెల్పర్లకు నెలకు రూ.10,000 జీతాలు పెంచుతామని పేర్కొన్నారు. కానీ అది జరగలేదు.

ఉత్తరప్రదేశ్‌లోని ఆర్థికంగా వెనుకబడిన 27 జిల్లాలు, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లతో ప్రారంభించి, అంగన్వాడీల పనిని డిజిటలైజ్ చేస్తున్నారు. మార్చి 2021లో, అంగన్వాడీల కార్యకర్తలకు ఒక స్మార్ట్‌ఫోన్ యాప్ అందించబడింది, ఇది ఆరోగ్య మంత్రిత్వ శాఖతో అనుసంధానించబడుతుంది, ఇది సమగ్ర శిశు అభివృద్ధి సేవల క్రింద వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య తనిఖీలు, పోషకాహార విద్యను నిర్వహించడంలో పాలుపంచుకుంటుంది. డిజిటల్‌గా నమోదు చేసిన రికార్డులను అప్లోడ్ చేయడంలో విఫలమైతే జీతం మరియు ఆహార సస్పెన్షన్కు దారితీయవచ్చని వారికి సమాచారం అందించారు. ఈ స్మార్ట్‌ఫోన్ యాప్‌ను ఉపయోగించడం కష్టతరంగా ఉండటం, కేవలం ఇంగ్లీషులో వ్రాయవలసి రావడం, స్మార్ట్ ఫోన్‌లో ఉన్నదానికంటే ఎక్కువ మెమరీని డిమాండ్ చేయడంతో స్మార్ట్ ఫోన్ ల వినియోగంలో ఇబ్బందులు తలెత్తాయి. యాప్లో పదే పదే తప్పులు రావడం, దానిని ఉపయోగించడానికి తగినంత ఇంగ్లీష్ పరిజ్ఞానం అంగన్వాడీల కార్యకర్తలకు లేకపోవడం, కొన్ని గ్రామాలలో ఫోన్ రిసెప్షన్ లు మరియు కరెంటు లేకపోవడంతో సంవత్సరాల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాదయాత్ర సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణలో అంగన్ వాడీ కార్మికులకు ఇస్తున్న జీతం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కార్మికులకు జీతం పెంచాలని, తెలంగాణ రాష్ట్రంలో పెంపుతో సమానంగా జీతాలను పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కార్మికులు సమ్మెకు దిగారు. వేతనాల పెంపుతోపాటు అంగన్వాడీ కార్మికుల ఇతర సమస్యల పరిష్కారానికి డిసెంబర్,12, 2023 నుండి అంగన్వాడీ కార్మికులు ఆందోళన బాట పట్టారు.

ప్రస్తుత సమస్యల రీత్యా అంగన్వాడీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతో పలు దఫాలుగా చర్చలు జరిపిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు(AWWs), హెల్పర్లు (AWHs)కు పెద్ద ఊరటనిస్తూ, వారి డిమాండ్లను పరిష్కరించేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారి తక్షణ అవసరాలను తీర్చడానికి రూ.80 కోట్ల నిధులను విడుదల చేయాలని ఆదేశించింది.

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల జీతాల పెంపుదల, గ్రాట్యుటీ, మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చడం, సర్వీస్ బెనిఫిట్ ముగింపు పెంపు, అంగన్వాడీ హెల్పర్‌లను అంగన్వాడీ వర్కర్‌లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు గరిష్ట వయసు పెంచడం, వారి పదవీ విరమణ వయస్సు పెంపు వంటి కొన్ని డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఇచ్చే గౌరవ వేతనం భారత దేశంలోనే 6వ మరియు 4వ స్థానంలో ఉంది. అంగన్వాడీ సహాయకులు (AWHs) అంగన్‌వాడీ వర్కర్లుగా (AWWs) పదోన్నతి పొందడంకోసం గరిష్ట వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచడం జరిగింది. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల కొనసాగింపు యొక్క గరిష్ట వయో పరిమితి (age of retirement) ని 62 ఏళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. సీనియర్ అంగన్వాడీ సిబ్బందికి 62 ఏళ్లు నిండిన తర్వాత పదవీ విరమణ బోనస్ లభిస్తుంది. 62 సంవత్సరాలు

నిండిన అంగన్వాడీ కార్యకర్తలకు ఒక లక్ష రూపాయలు, సహాయకులకు 40 వేల రూపాయల సర్వీస్ బెనిఫిట్ లభిస్తుంది. 20.12.2023 నుండి అమలయ్యే విధంగా అంగన్వాడీ వర్కర్లు నెలవారీ అంగన్వాడీ హెల్పర్లు ద్వైమాసికానికి TA/DAని క్లెయిమ్ చేసుకునేందుకు అనుమతించింది. మొత్తం 6,837 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చే ప్రతిపాదనను ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తోంది. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో 16,575 అద్దె భవనాలు, పట్టణ ప్రాంతాల్లో 6,705 అద్దె భవనాలకు గానూ రూ.66.54 కోట్లు మంజూరయ్యాయి. ఇదే కాకుండా అంగన్వాడీ వర్కర్ల వినియోగ వస్తువులు (సబ్బు, ఫినైల్ మొదలైనవి) కోసం అదనంగా మరొక రూ.7.81 కోట్లు నిధులు విడుదల చేసింది. 21,206 అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ఒక్కో కేంద్రానికి రూ.3000/- చొప్పున మొత్తం రూ.6.36 కోట్లు విడుదలయ్యాయి. కేంద్రం కోరిన విధంగా ఈ నిధులను అంగన్వాడీ కార్యకర్తలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

అంగన్ వాడీ కార్యకర్తలు గానీ, అంగన్‌వాడీ సహాయకులు చేస్తున్న సమ్మె కారణంగా చాలా చోట్ల అంగన్ వాడీలలో పౌష్టికాహార కిట్లు అందడం లేదు. అంగన్ వాడీలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గిపోయింది. అక్షరాస్యత మరీ తక్కువ ఉన్నప్రాంతాలలో గర్భిణులకు, బాలింతలకు సరైన సూచనలు ఇచ్చేవారు కరువయ్యారు.

ప్రస్తుతం తెలంగాణలో అంగన్వాడీ వర్కర్‌లకు రూ.14750/- చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌లో రూ. 15750/- చెల్లించాలని అంగన్వాడీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే జీతాలు, మెస్ బిల్లులు సరిపోక కేంద్రాల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంగన్వాడీ కార్యకర్తలు ఆరోపించారు. ప్రతీరోజూ గ్యాస్ సిలిండర్, కిరాణా, ఇతర ఖర్చుల వివరాలన్నీ మొబైల్ ఆప్‌లలో డేటా ఎంట్రీ పేరుతో ప్రభుత్వం తమను వేధిస్తున్నదని, ఇది వారి సమయాన్ని వృథా చేస్తోందని అంగన్‌వాడీ కార్మికులు ఆరోపిస్తున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత 40 రోజులుగా అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధరకాలుగా ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు. ''మా నోట్లో మట్టి కొట్టొద్దు'' అంటూ ప్లేట్లలో మట్టితో తిరుపతిలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట అంగన్ వాడీలు నిరసన తెలిపారు.

అంగన్ వాడీల సమ్మెను 6 నెలల పాటు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. ఎస్మా ను ప్రయోగిస్తూ జారీ చేసిన G.O.No.2 ప్రతులను తగలబెట్టి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు సమ్మెను విరమించి విధుల్లోకి చేరేందుకు ఈనెల 8 వరకు డెడ్‌లైన్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. 8వ తేదీ సాయంత్రంలోగా విధుల్లోకి చేరాలని అంగన్‌వాడీల మొబైల్ ఫోన్‌లకు సమాచారాన్ని కూడా పంపింది. 9 నుండి CDPOల ద్వారా అంగన్వాడీలకు వారి పేరు మీద నోటీసులు జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చింది. అంగన్వాడీలకు ప్రభుత్వానికి మధ్య ఆరుసార్లు చర్చలు జరిగినప్పటికీ వేతనాల విషయంలో ప్రభుత్వం దిగి రాలేదు. దాంతో అంగన్వాడీలు సంతకాల సేకరణ కార్యక్రమం మొదలుపెట్టారు. ఒక్క వేతనాల విషయంలో తప్ప మిగిలిన డిమాండ్ల విషయంలో ప్రభుత్వం ఎంతోకొంత సానుకూలంగా స్పందించింది కాబట్టి వేతనాల విషయంలో కూడా ప్రభుత్వం నుండి సానుకూల స్పందన వస్తుందని ఆశిద్దాం. ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Anupama Monthly**
Account No:**3309747713**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Anupama Monthly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:anupama monthly@gmail.com**



# భిన్నమైన జంతువు తోడేలు

ఖాసిమా

టర్కీ జాతీయ జంతువు తోడేలు. టర్కీ ప్రజలు తోడేలును చాలా ఇష్టపడతారు. వారి పిల్లలను తోడేలుతో పోల్చి ధైర్యసాహసాలు నూరిపోస్తారు. తల్లిదండ్రుల పట్ల విశ్వాస పాత్ర కలిగిన జంతువు తోడేలు. ఇది వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు సేవ చేస్తుంది. తోడేలు ఆత్మగౌరవం కలిగిన జంతువు. తోడేలు దేనికీ లొంగి ఉండటానికి ఇష్టపడదు. ఇది స్వేచ్ఛను కోరుకునే జంతువు. ఇది తన ఆహారాన్ని ఎప్పటికప్పుడు వేటాడి తింటుంది. చనిపోయి పడివున్న మాంసాన్ని ఇది తినదు. తోడేలు ఎక్కడ పట్టుబడితే అది ఆహారం తీసుకోవడం మానివేస్తుంది.

తోడేలు ఇతర జాతి జంతువుల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తోడేలు ఒకే ఆడ తోడేలుతో సంబంధం పెట్టుకుంటుంది. అలాగే ఆడ తోడేలు కూడా ఒక మగ తోడేలుతోనే భాగస్వామ్య సంబంధం కలిగి ఉంటుంది. తోడేలు మనుషుల కన్నా కూడా ఎక్కువగా వావివరుసలను పాటిస్తుంది. తల్లి, చెల్లి వంటి సంబంధం ఉన్న తోడేలును ఎప్పుడు చెడ్డచూపు చూడదు. వాటిని గౌరవంతో చూసుకుంటుంది. తోడేలు ఒకే తోడేలుతో సంబంధం ఏర్పరచుకోవడం వలన వాటి పిల్లల సంరక్షణను చాలా శ్రద్ధగా చేస్తాయి. తోడేలు దానితో సంబంధం ఉన్న ఏ తోడేలు మరణించినా మూడు నెలల వరకు ఆ చోట ఉండి సంతాపం తెలియజేస్తూ దుఃఖిస్తుంది.

ధైర్యం, ఆత్మ నిగ్రహం, మంచి నడవడిక తోడేలుకు ఉన్న అత్యుత్తమమైన లక్షణాలు. తోడేళ్ళు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలస పోయేటప్పుడు ఒంటరిగా కాకుండా ఒక సమూహంగా వలస వెళతాయి. తోడేళ్లు అన్ని రకాల సమర్థత కలిగిన, ధైర్యం కలిగిన, తెలివిగల తోడేలును తమకు నాయకునిగా ఎన్నుకుంటాయి. ఇది ఒక్కటి వెయ్యితో సమానంగా ఉంటుంది. అటువంటి నాయకుడ్ని ఎన్నుకుంటాయి. తోడేలు వాటి సమూహాన్ని అన్ని రకాలుగా పర్యవేక్షిస్తూ రక్షిస్తుంది. ఇవి వలస పోయేటప్పుడు కూడా ఎంతో వ్యూహాత్మకంగా వలస వెళతాయి. వీటి గుంపులో ముందు వరుసలో ఎదుటి జంతువుల దాడిని బలంగా ఎదుర్కొనే విధంగా ఉన్న తోడేళ్ళు ఉంటాయి. మధ్యలో బలహీనమైన, వృద్ధ తోడేళ్ళు ఉంటాయి. చివరన వీటి నాయకుడు మొత్తం సమూహాన్ని పర్యవేక్షిస్తూ వెనుక నుండి ఎటువంటి ప్రమాదం జరగకుండా రక్షణ కల్పిస్తూ వుంటాడు.

మనిషి తోడేళ్ళను పెంపుడు జంతువుగా చేసుకోలేకపోయాడు. ఎందుకంటే ఇవి ఒంటరిగా ఉండటానికి ఇష్టపడవు. సింహాలను, పులులను మచ్చిక చేసుకొని పెంచుకోవచ్చు. కానీ తోడేళ్ళను పెంచలేము. తోడేళ్ళు ఒక్క కంటితో నిద్రపోతాయి. మరో కంటితో పరిసరాలను పర్యవేక్షిస్తూ ఉంటాయి. కుక్కలు కూడా తోడేళ్ళ జాతికి చెందినవే. 'హయాతే అలీ హైవాన్' పుస్తకం ప్రకారం అడవి జంతువులు అన్ని కూడా తోడేళ్ళకు భయపడతాయి. గ్రామాలలో పెంపుడు జంతువుల రక్షణ కోసం ఇంటి వద్ద తోడేలు తలను భయపెట్టడానికి కట్టి ఉంచుతారు. వీటిలోని కొన్ని జాతులు పూర్తిగా అంతరించిపోయాయి.

ప్రస్తుతం మానవ జాతిలో లేని ఎన్నో మంచి గుణగణాలను తోడేళ్ళు కలిగి ఉన్నాయి. ఇవి ఆడ తోడేలు కోసం పోట్లాడుకోవు. అలాగే విలువలను కలిగి ఉంటాయి. అలాగే వాటి నాయకుణ్ని ఎన్నుకునే విధానం కూడా మానవులు నేర్చుకోవలసిందే. ప్రస్తుతం మానవుల్లో పెరుగుతున్న విచ్చలవిడితనం, అక్రమ సంబంధాల పరంపర కనీసం జంతువు నుండైనా నేర్చుకుంటే బాగుంటుంది. మనిషి నైతికంగా జంతువు కన్నా హీనంగా మారుతున్నాడు.



# కుంటుపడుతున్న కుటీర పరిశ్రమ

ఆయేషా మునీర్, మండపేట


**కుటీర పరిశ్రమ** అంటే తక్కువ పెట్టుబడితో ఇంటి సభ్యులతో నడిపే చిన్నచిన్న పరిశ్రమలను కుటీర పరిశ్రమ అంటారు. కుటీర పరిశ్రమ చిన్న చిన్న పనిముట్ల ద్వారా నిర్వహించడం జరుగుతుంది. ఈ పరిశ్రమలకు ఆర్థిక వ్యవస్థలో విశేషమైన స్థానం ఉన్నది. కుటీర పరిశ్రమలను నడిపేవారు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివారు. అనేక మందికి ఉపాధి కల్పించేదే కుటీర పరిశ్రమ. దీనిని మూడు విభాగాలుగా విభజించవచ్చు.

1. వ్యవసాయానికి సంబంధించిన కుటీర పరిశ్రమ.
2. వ్యవసాయేతర కుటీర పరిశ్రమ.
3. వాణిజ్య సంబంధిత కుటీర పరిశ్రమ.

భారతదేశంలో అనేక పురాతన ప్రసిద్ధ కుటీర పరిశ్రమలు ఉన్నాయి. ఈ కుటీర పరిశ్రమలు విస్తారమైన ఉపాధి అవకాశాలను అందిస్తాయి. దీని ఫలితంగా పేదరికం తగ్గు ముఖం పడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఒక ప్రభావంతమైన సాధనంగా పరిగణించబడుతుంది. ముఖ్యంగా ఇది మహిళల స్వీయ విశ్వాసాన్ని ప్రోత్సహిస్తుంది. అయితే ప్రస్తుతం కుటీర పరిశ్రమలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. దీని కారణంగా చాలామంది ఉపాధి లేక సతమతమవుతున్నారు.

ప్రస్తుతం కుటీర పరిశ్రమ మూతపడడానికి పారిశ్రామికీకరణ కారణం అని చెప్పుకోవచ్చు. ఏదైనా పరిశ్రమ విజయానికి సాంకేతిక పురోగతి కీలకం. పెద్ద పరిశ్రమలు మరియు కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా తమ వ్యాపారాన్ని విస్తరించడానికి, పెంచుకోవడానికి సాంకేతికతను వినియోగించుకుంటాయి. కుటీర పరిశ్రమలు నడిపే వారికి అత్యాధునిక సాంకేతికత సాధనాలు, ఉత్పత్తి సాంకేతికతలపై తగిన పరిజ్ఞానం లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. అదేవిధంగా వ్యాపారాన్ని మార్కెటింగ్ చేసే విధానం మార్కెట్లోని కొత్త ట్రెండ్ల గురించి తెలుసుకోవడం కోసం ఇంటర్నెట్ అవసరం ఏర్పడుతుంది. అయితే కుటీర పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాలలో ఉండడం వల్ల వారికి ఇంటర్నెట్ అవగాహన లేకపోవడం లేదా నెట్ సౌకర్యం లేకపోవడం వల్ల కూడా కుటీర పరిశ్రమలు అభివృద్ధిపై ప్రభావం పడుతుంది అని చెప్పుకోవచ్చు.

కుటీర పరిశ్రమలు పరిమితి వనరులు లేదా ముడి పదార్థాలను కలిగి ఉంటాయి. అవి కాలక్రమేనా తగ్గుముఖం పడుతున్నాయి లేదా సీజన్లలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఇది కూడా కుటీర పరిశ్రమ వెనకబడడానికి ఒక కారణం. ఆర్థిక పరిమితుల కారణంగా కూడా వారికి వనరులు లభించకపోవచ్చు. ప్రస్తుతం వ్యాపార వృద్ధిలో మార్కెటింగ్ కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాపార ప్రకటనలు, సోషల్ మీడియా, వార్తాపత్రికలు, కరపత్రాలు మొదలైన వాటి ద్వారా వ్యాపారాన్ని ప్రోత్సహించడం చాలా అవసరం. కానీ కుటీర పరిశ్రమలు ప్రకటనలలో మార్కెటింగ్ కోసం ఖర్చులుచేయడంలో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. మార్కెటింగ్ చేసే నైపుణ్యం కూడా కుటీర పరిశ్రమ నడిపే వారికి లేకపోవచ్చు ఇది కూడా ఒక కారణం. కుటీర పరిశ్రమలు కార్మిక శ్రామిక శక్తిపై ఆధారపడతాయి నైపుణ్యం కలిగిన కార్మికులు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం వల్ల కూడా కుటీర పరిశ్రమ సమస్యలు ఎదుర్కొంటుంది.




**తస్నీమ్‌జహాన్ ఖాన్**

స్త్రీ జీవితంలో రుతుచక్రం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. రజస్వల అయినప్పటి నుండి వృద్ధాప్య దశకు చేరుకునే వరకు రుతుచక్రం రకరకాల మార్పులకు గురవుతుంది. రకరకాల ఇబ్బందులు కలుగ జేస్తుంది. అనేక రకాల శారీరక, మానసిక సమస్యలకు, భయాందోళన లకు గురిచేస్తుంది. రుతుచక్రం సక్రమంగా, సజావుగా ఉండేవారికి ఎలాంటి బాధ ఉండదు. కానీ రుతుచక్రం అనియమితంగా ఉన్నవారికి అనేకానేక సవాళ్ళు ఎదుర్కోవలసి వస్తుంది. రుతుచక్రం ఆగిపోవడానికి ముందు కూడా అనేకానేక ఇబ్బందులు కలుగుతాయి. ఈ దశను మెనోపాజ్ అని అంటారు. దీని లక్షణాలు ఏమిటి? దీన్ని ఎలా మేనేజ్ చెయ్యాలి? దీనివల్ల కలిగే మానసిక సమస్యలు ఏమిటి? అనే అంశాలను చర్చించుకుందాం...

## మెనోపాజ్ అనగా...

మెనోపాజ్‌ను రుతువిరతి అని కూడా అంటారు. సాధారణంగా 45-55 సంవత్సరాలు గల మహిళల్లో ఈ దశ కనబడుతుంది. రుతుచక్రం ముగింపును ఇది సూచిస్తుంది. ఇది మహిళ జీవితంలో ఎదురయ్యే సహజమైన జీవ ప్రక్రియ. మహిళ అండాశయాలు గుడ్ల ఉత్పత్తిని ఆపివేసినప్పుడు ఈ దశ కలుగుతుంది. ఇది రుతుకాలం పూర్తిగా ముగిసిపోవడానికి సంకేతాన్నిస్తుంది. మహిళకు వరుసగా 12 నెలల పాటు రుతుచక్రం రానప్పుడు మెనోపాజ్ దశ వచ్చినట్టు నిర్ధారణ జరుగుతుంది. ఈ దశలో స్త్రీలోని ఈస్ట్రోజెన్ స్థాయిలు గణనీయంగా పడిపోతాయి. దీనివల్ల అనేక శారీరక, మానసిక ఇబ్బందులు ఎదురవుతాయి.

## మెనోపాజ్ లక్షణాలు

మెనోపాజ్ లక్షణాలు ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా ఉండవచ్చు. మహిళకు మహిళకు ఈ లక్షణాలు తేలికపాటిగానూ ఉండవచ్చు, తీవ్రంగానూ ఉండవచ్చు. కామన్‌గా కనపడే కొన్ని లక్షణాలు కింది విధంగా ఉంటాయి.

1. వేడి ఆవిర్లు, రాత్రి నిద్రలో చెమటలు పట్టడం అనే లక్షణాలు ఎక్కువ మందిలో కనబడతాయి. నీరసం, అలసట ఎక్కువగా ఉంటుంది.
2. క్రమ రహిత పీరియడ్స్, వరుసగా 12 నెలలు పీరియడ్స్ రాకపోవటం.
3. చిరాకు, ఆందోళన, నిరాశ లాంటి ప్రతికూల భావనలు, మూడ్ స్వింగ్స్ ఉంటాయి.
4. నిద్రలేమి, నిద్రలో చెమటలు, రాత్రి గుండె దడగా ఉండటం, గుండె జబ్బులు.
5. ఎముకలు బలహీనంగా, పెళుసుగా మారి ఆస్టియోపొరోసిస్ కలిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. వెన్ను నొప్పి ఉంటుంది.
6. బరువు పెరగటం, చర్మం పొడిబారడటం.
7. హార్మోన్ల అసమతుల్యత.
8. కొందరికి బిపి రావచ్చు, టెన్షన్ రావడం కూడా చూడవచ్చు.
9. మెనోపాజ్ దశకు ముందుగా పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం, పీరియడ్స్ ఆలస్యమవడం, లేదా తొందరగా రావడం, వాజీనల్ డ్రైనెస్, మూత్రంలో మంట వంటి లక్షణాలు దాదాపు 2-5 సంవత్సరాలు కనబడవచ్చు. ఈ దశను పెరిమెనోపాజ్ దశ అంటారు.

## మెనోపాజ్- మానసిక సమస్యలు

శరీరంలో జరుగుతున్న మార్పుల వలన ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్లు తగ్గిపోవడం వలన, అధిక రక్తస్రావం అనియమిత పీరియడ్స్ వంటి అనేక లక్షణాలు మానసిక ఆరోగ్యంపైన ప్రభావం చూపుతాయి. మూడ్ స్వింగ్స్, యాంగ్జైటీ, డిప్రెషన్, నిద్రలేమి వంటివి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అకారణంగా ఏడ్వటం, అంతలోనే నవ్వడం వంటి లక్షణాలు కనబడతాయి. ఈ సమయంలోనే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి రోగాలు బయటపడినప్పుడు మానసికంగా చాలా ఒత్తిడి కలుగుతుంది. కొంతమందికి వృద్ధాప్య ఛాయలు మొదలవ్వడం, శారీరకంగా బలహీనతగా ఉండటం వంటి అంశాలు చాలా భయాందోళనకు గురిచేస్తాయి. ముఖంపై ముడతలు, ముఖ కాంతి తగ్గిపోవడం, తెల్లజుట్టు వల్ల ఆత్మన్యూనతా భావానికి గురవుతారు.

## మెనోపాజ్ సమస్యలకు పరిష్కారాలు

ఈ దశ అనేది ప్రతీ స్త్రీ జీవితంలో వచ్చి తీరాల్సినదే అనే వాస్తవాన్ని దిగమింగాల్సి ఉంటుంది. యవ్వనం కలకాలం ఉండదు అని గ్రహించాలి. ఈ దశలోని లక్షణాలను అవగాహన చేసుకుంటే కాస్త మానసిక ఆందోళన తగ్గుతుంది. ఏ ఒక్క లక్షణమైనా తీవ్రతరంగా ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి తగిన వైద్యం తీసుకోవాలి. చాలామంది చేసే తప్పు ఏమిటంటే, మెనోపాజ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా 'ఇది సహజమే' అని నిర్లక్ష్యం చేసి ట్రీట్‌మెంట్ తీసుకోరు. ఫలితంగా మందులతో పోయే సమస్యలు సర్జరీ వరకు తీసుకుపోతాయి. ఇందులో జరిగే శారీరక మార్పులకు మంచి పోషకాహార సేకరణ ద్వారా రిలీఫ్ పొందవచ్చు.

## మెనోపాజ్‌లో తీసుకోవలసిన డైట్

ఈ దశలో ఈస్ట్రోజన్ స్థాయి తగ్గి శరీరంలో మెటబాలిజం నెమ్మదించటం వల్ల శరీరంలో కొవ్వు చేరి బరువు బాగా పెరిగిపోవటం జరుగుతుంది. బరువు బాగా పెరిగిపోతుంది అనే భయంతో తిండి తగ్గిస్తారు. దీనివల్ల పోషకాహార లోపం కలిగి వేరే అనారోగ్యాలు వస్తాయి. పోషకాహార లోపం ఉన్న వారిలో మెనోపాజ్ లక్షణాలు తీవ్రంగా ఇబ్బంది పెడతాయి. అందువల్ల సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరం. పిండి పదార్థాలు, ప్రోటీన్లు సరిసమాన భాగాల్లో రోజూ తీసుకోవాలి. ఆలివ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటల్లో వాడాలి. ఫ్రైలకు బదులు పులుసు కూరలు తినాలి. నెయ్యి, వెన్న, డాల్డా బాగా తగ్గించాలి. ఒమెగా-3 ఫ్యాటి ఆసిడ్ గల చేపలను తినాలి.

శరీరంలో వేడి ఆవిర్ల సమస్య ఉన్నవారు సోయా బీన్స్, సోయా పదార్థాలు, అవిశ గింజలు, కాబులి శనగలు, వేరుశనగలు తింటే మంచి ఉపశమనం ఉంటుంది.

ఎముకలు బలహీనమవటం అనే సమస్య నుండి కోలుకునేందుకు విటమిన్-డి, కాల్షియం ఉండే పదార్థాలు సహాయం చేస్తాయి, పాలు, పెరుగు లేదా కాల్షియం సప్లిమెంట్స్ తీసుకోవాలి. సూర్యోదయం లేదా సూర్యాస్తమయం సమయంలో పావు గంట ఎండలో ఉండాలి. గుడ్లు, చేపలు తింటే మంచిది.

ఈ దశలోనే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. కాబట్టి యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉండే ఫుడ్ తీసుకోవాలి. గ్రీన్ టీ, అక్రూట్, మొలకెత్తిన గింజలు, తాజా పండ్లు, కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్‌లు అధికంగా లభిస్తాయి.

ఈ దశలో మలబద్ధకం సమస్య అధికంగా వస్తుంది. అందువల్ల పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజూ ఏదో ఒక రెండు రకాల పండ్లను తప్పనిసరిగా తినాలి.

## కొన్ని చిట్కాలు

చల్లని చెమటలు, వేడి ఆవిర్లు, చికాకు, కోపం, మతిమరుపు, నిద్రలేమి, చిన్న చిన్న విషయాలకే ఏడ్వటం వంటి సమస్యలు అధిగమించి ఉత్సాహాన్ని పునరుద్ధరించేందుకు ఉదయం, సాయంత్రం పావు గంట సేపు వాకింగ్ చేయాలి. కొత్త వ్యాయామాలు అలవాటు చేసుకోవాలి. మొక్కలు పెంచటం, పెయింటింగ్, కుట్లు, అల్లికలు, పుస్తకాలు చదవడం వంటి అలవాట్ల వల్ల ఒత్తిడి నుండి ఉపశమనం పొందవచ్చు.

చెమటలు బాగా పడుతుంటాయి కాబట్టి వదులైన కాటన్ దుస్తులు ధరించే ప్రయత్నం చేయాలి. రోజుకు 8 గ్లాసుల మంచి నీళ్ళు త్రాగాలి. డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి.

## ఆధ్యాత్మికతపై ప్రభావం

మెనోపాజ్‌కు ముందు ఉండే పెరిమెనోపాజ్ దశ స్త్రీలను తీవ్రంగా కృంగదీస్తుంది. ఎందుకంటే, అనియమిత పీరియడ్స్ వస్తుంటాయి. కరెక్టుగా నెలనెలా పీరియడ్ రాదు. డేట్‌కు ముందుగానైనా లేదా రెండు మూడు నెలలు ఆలస్యంగానైనా వస్తుంటుంది. ఇంకా ఎప్పుడు పడితే అప్పుడు అధిక రక్తస్రావం రోజులు, వారాల తరబడి ఉంటుంది. లేకపోతే స్పాటింగ్ కొద్దికొద్దిగా కనబడుతుంటుంది. దీనివలన దైవారాధనలు సక్రమంగా చెయ్యలేకపోతున్నాము అనే కృంగుబాటు తనం కలుగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనలేకపోవటం బాధను కలుగజేస్తుంది. కొన్ని నెలలు ఓపికగా ఉంటే సమస్యలన్నీ తీరిపోయి జీవితం మళ్ళీ కొత్త పుంతలు తొక్కుతుందనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. దైవనామస్మరణను అలవాటు చేసుకోవాలి. దైవనామస్మరణతోనే మనసును కుదుటపర్చుకోవాలి. దానధర్మాలు విరివిగా చేయాలి. పరుల సేవలో సదా ముందంజ వెయ్యాలి. అలవాటుగా మారిన పాపాలను పూర్తిగా మానేసి, కడిగిన ముత్యం వలే నైతికంగా మహోన్నత శిఖరాలను అధిరోహించాలి. ఆలోచనల్లో, అలవాట్లలో, బిహేవియర్‌లో పరిపక్వతను పెంపొందించుకోవాలి.

మెనోపాజ్ దశకు చేరుకున్నట్లయితే ఇక నుంచి పెద్దరికం, హుందాతనం మీ సొంతమైనట్లే. పెద్దరికాన్ని ఎల్లప్పుడూ కాపాడుకునే ప్రయత్నం చెయ్యాలి. దైవసామీప్యతకై, పరలోక సఫలతకై పరితపించాలి. పాపాలను పూర్తిగా పరిత్యజించాలి. కేవలం సత్కార్యాలపైనే దృష్టి సారించాలి. మన కథ ఇక క్లైమాక్స్ దశగా మరలింది అని తెలుసుకుని మసలుకోవాలి.




**ప్రతి శుక్రవారం** నమాజ్ ముగించిన తరువాత మస్జిద్ ఇమామ్ గారు ఆయన గారి 11 సం॥ల కుమారుడు ఆమ్‌స్టర్ దామ్ వీధులలో బయలుదేరి ప్రజలకు 'స్వర్గం పొందే మార్గం' శీర్షిక ఉన్న ఒక పాంప్లెట్ ఇంగ్లీషులో ముద్రింపబడిన ప్రతిని పంచడం వారి అలవాటు. ఒక శుక్రవారం ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురుస్తుంది. తోడుగా ఎముకలు కొరికే చలి. పిల్లవాడు ఒంటినిండా చలి దుస్తులు కప్పుకొని తన నాన్న గారితో నేను సిద్ధంగా వున్నాను నడవండి' అన్నాడు.

తండ్రి: నాన్నా ఎక్కడికి ప్రయాణం అన్నాడు.

బాలుడు: 'నాన్నా, పాంప్లెంట్స్‌లు పంచే సమయమైంది' అన్నాడు.

తండ్రి : 'నాన్నా! ఈ రోజు వాతావరణమంతా చల్లగా వుంది. వర్షం కూడా కురుస్తూవుంది. ఈ రోజు నాగా పెడదాం' అన్నాడు.

దానికి సమాధానంగా కొడుకు దిగ్భ్రాంతికి గురి చేసే మాటా అన్నాడు.

నాన్నా చాలామంది నరకం వైపు సాగుతున్నారు అన్నాడు.

తండ్రి; 'బేటా ఈ వాతావరణంలో బయలుదేరటం సరికాదు'.

బాలుడు 'సరే నాన్న గారు నాకు అనుమతి ఇవ్వండి నేనొక్కడినే వెళ్తాను' అన్నాడు.

తండ్రి కొంచెంసేపు ఆలోచించి 'సరే జాగ్రత్తగా వెళ్లు' అన్నాడు.

సాత్విక భావాలు కల పదకొండు ఏళ్ళ పిల్లవాడు తండ్రికి షుక్రియా చెప్తూ బయలుదేరిపోయాడు. ఆ వయసు పిల్లలు సాధారణంగా ఆటపాటలతో సరదాగా వుంటారు. కానీ ఈ వికసించే మొగ్గ ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నాడు. ఆ వర్షంలో దారిలో తడుస్తూ పరిగెడుతూ జనులను కలుస్తూ ఆ ప్రతులను అందజేస్తూ దాదాపు రెండు గంటలు తడిసిన తరువాత అతని దగ్గర కేవలం ఒక ప్రతి మిగిలింది. అటూఇటూ దృష్టి సారించాడు. ఆ ఒక్క ప్రతి ఇద్దామని. కానీ ఒక్క ప్రాణి కనబడలేదు. వర్షం, చలి కారణంగా నగరం అంతా నిర్మానుష్యంగా ఉంది. ఏ ఒక్క బాటసారి కనబడలేదు. అక్కడే ఉన్న చిన్న ఇంటివైపు సాగాడు. ఎవరైనా కనిపిస్తారేమో ఆ ప్రతిని ఇద్దామని.

ఇంటి దగ్గరగా వెళ్లి తలుపు తట్టాడు. ఎటువంటి సమాధానం రాలేదు. మళ్ళీ మళ్ళీ తలుపు తట్టాడు. అతని మనసులో ఏ భావం కలుగుతుందో, ఆ ఇంటి నుండి వెనక్కి మరలటం ఇష్టంలేక ఇంకా గట్టిగా తలుపు తట్టాడు.

కొన్ని క్షణాలు గడిచిన తరువాత ఒక వయసు మళ్ళిన మహిళ తలుపు తెరిచింది. ఆమె ముఖంలో నిరాశ, విచారం కలగలసి వున్నాయి. బాబు నీ పేరేంటి అని అడిగింది. ఆ కిశోర బాలుడు చిరునవ్వుతో మెరిసే కళ్ళతో, లేత పెదాలతో అమ్మా కష్టం కలిగించినందుకు క్షమాపణలు కోరుతూ వాలిన

చూపులతో 'మీకు శుభవార్త తెలియజేయడానికి వచ్చాను. అల్లాహ్ మిమ్మల్ని అమితంగా ప్రేమిస్తున్నాడు. నన్ను మీ దగ్గరకు పంపాడు అని మిగిలిన చివరి ప్రతిని ఆమెకు అందించాడు. ఈ పుస్తకం మీకు అల్లాహ్ గురించి కొన్ని శుభవార్తలు తెలియజేస్తుంది. సృష్టికర్తకు, సృష్టికి వాస్తవికతను తెలియజేస్తుంది' అన్నాడు.

ఆ స్త్రీ ఆ ప్రతిని అందుకొని కృతజ్ఞతలు చెప్పి లోపలికి వెళ్ళిపోతుంది. ఆ పిల్లవాడు కూడా ఇంటికి వెళ్ళిపోయాడు. మరుసటి వారం జుమా ప్రసంగం పూర్తయిన తరువాత ఆ మహిళ ఆ సమూహానికి ఎదురుగా నిల్చుని అందర్నీ సంబోధిస్తూ 'నాకు ఇక్కడ తెలిసిన వారెవరూ లేరు. ఇంతకు ముందు నేను ఇక్కడికి వచ్చే అవకాశం కలుగలేదు. పోయిన శుక్రవారం వరకు నేను ముస్లింను కాదు. నేనెప్పుడూ ముస్లిం కావాలనే ఆలోచన రాలేదు. (నా మనసులో ఆ ఆలోచన కలుగలేదు)

కొన్ని నెలలకు ముందు నా భర్త గతించారు. నన్ను ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోయారు. ఆయన పోయిన తరువాత నాకు జీవితం భారం అయిపోయింది.

గత శుక్రవారం తీవ్రంగా వర్షం కురుస్తుంటే నేను ఆత్మహత్య చేసుకుందామని, దుర్భర జీవితం నుండి విముక్తి పొందాలని అనుకున్నాను. ఎందుకంటే నాకు జీవితం పట్ల ఏ మాత్రం ఆసక్తి లేదు. అందుకని ఇంటి పైభాగంలోకి వెళ్ళి త్రాడు, కుర్చీ సహాయంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఓ ప్రాణి దూతలా వచ్చాడు. అప్పుడే నేను తలుపు తట్టిన శబ్దం విన్నాను. నేను కొంచెం సేపు ఆలస్యం చేశాను. తలుపు కొట్టీ కొట్టీ వెళ్ళిపోతాడేమో అని భావించాను. కానీ ఆగకుండా తలుపు కొడుతుంటే మెడలో నుండి త్రాడు తీసి ఎవరై ఉంటారా? అని సందిగ్ధంలో పడ్డాడు.

ఇలాంటి గంభీరమైన వాతావరణంలో నా తలుపు ఆగకుండా తడుతున్నది ఎవరై ఉంటారా అని, చివరికి నేను క్రిందకు వచ్చాను. తలుపు తెరిచి చూస్తే ఒక చిన్న బాలుడు చిరునవ్వు నవ్వుతూ తడుస్తూ నా కళ్ళముందు నిల్చున్నాడు. ఆ పెదవుల మెరుపు కళ్ళ వెలుగు నేనెప్పుడూ ఏ వ్యక్తిలో చూడలేదు.

ఆ ప్రత్యక్ష దూత గురించి నా దగ్గర వర్ణించటానికి మాటలు లేవు. అతని నోటి నుండి వెలువడే పలుకులు, అతి విలువైన ఆణిముత్యాలు నా హృదయ ఫలకంపై అతడి పలుకులు అత్యంత ప్రభావం చూపాయి. ఇక నా మృత హృదయానికి ఎవరో జీవన శుభవార్త అందజేశారు.

అతని శుభవార్త ఏమంటే అల్లాహ్‌తాలా మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు. మీ గురించి శ్రద్ధ తీసుకుంటాడు అని ఆ పిల్లవాడు ఈ ప్రతిని 'స్వర్గానికి మార్గాలు' అనే పుస్తకాన్ని నా చేతుల్లో పెట్టాడు.

నేను తలుపు మూసి వద్దనుకుంటూనే ఈ పుస్తకాన్ని చదవసాగాను. కన్నీళ్ళతో నా కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. నాలో ఒక చైతన్యం వచ్చింది. అల్లాహ్‌తాలా నా నుండి ఏమి కోరుతున్నాడో అనే విషయం తెలుసుకున్నాను. నేను త్రాడును, కుర్చీని తోసేసాను. ఎందుకంటే నాకు జీవన ఆధారం దొరికింది. ఇప్పుడు నాకు జీవితం విలువ తెలిసి వచ్చింది. నేను నా ప్రభువును తెలుసుకున్నాను. నన్ను అదృష్టవంతురాలిని చేసిన ఈ పుస్తకంపై ఇవ్వబడిన చిరునామా ఆధారంగా నేను ఇక్కడకు చేరుకున్నాను. కృతజ్ఞతలు చెల్లించటానికి ఇక్కడికి వచ్చాను. నేను ఆ చిన్న దైవదూతకు కృతజ్ఞతలు చెల్లించటానికి వచ్చాను. అతనే నన్ను నరకపుటంచుల నుండి రక్షించటానికి వచ్చాడు.

మస్జిద్ నలు వైపుల అందరి కళ్ళు అశ్రుపూరితా లయ్యాయి. తక్బీర్‌ల ధ్వనులతో మస్జిద్ అంతా ప్రతిధ్వనించింది. అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్.

ఇమాం సాహిబ్ గారు ఆ చిన్న దూతకు తండ్రి గారు. మింబర్ పై నుండి దిగి మొదటి వరుసలోనున్న తన ముద్దుల కుమారుడ్ని ఆలింగనం చేసుకుని గట్టిగా ఏడ్వసాగారు.

ఆ సమూహంలో తన వంటి అదృష్టవంతుడైన తండ్రి ఎవరూ వుండరని ఆయనకు అవగతం అయిపోయింది. తన కుమారుడు నిజమైన ఆణిముత్యాలను ఏరుకుంటున్నాడు. తను వర్షం సాకుతో బలహీనతను చూపినప్పటికీ తన కుమారుడిలో జనుల హిదాయత్ గురించిన తపన చూసి తనకు చాలా సిగ్గువేసింది.

దీనిలో మనకు గొప్ప గుణపాఠం వుంది. మనం స్వయంగా ప్రశ్నించుకోవాలి. ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మనలో జనులను నరకజ్వాలల నుండి రక్షించే తపన వుందా? మనం ప్రయత్నం చేస్తున్నామా? మన హృద యాలలో ఆ తపన, బాధ ఉన్నాయా? మన ప్రవక్త గారికి ఉన్నటువంటి తపన వుందా? ఈ చిన్న పిల్లవాడిలో ఉన్నట్లుగా.

మనకు ఎక్కడైనా, ఎప్పుడైనా అవకాశం దొరికితే మనకున్న పరిమిత వనరులతోనే దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్య సందేశం అందజేసే ప్రయత్నం చేయాలి.

అల్లాహ్‌తాలా మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించాలి. (ఆమీన్)



- అస్మా హుసైన్, హన్మకొండ

# భార్యాభర్తల సంబంధం

**అల్లాహ్** ఈ సృష్టిని సృష్టించే ముందే స్త్రీపురుష జంటను సృష్టించాడు. ఆదమ్ (అలై), హవ్వా (అలై)ను స్వర్గంలో సృష్టించాడు. దీనినిబట్టి మనం అర్థం చేసుకోవచ్చు భార్యాభర్తల సంబంధం ఎంత పవిత్రమైనదో. ఈ ప్రపంచంలో అన్ని సంబంధాల కంటే ముఖ్యమైనది, చాలా సున్నితమైనది, చాలా గొప్పది.

## భార్యా భర్తలు ఒకరికొకరు దుస్తులు

భార్యాభర్తల సంబంధమే అన్ని సంబంధాలకు పునాది. కావున ఈ సంబంధం దృఢంగా వుండటం ఎంతో అవసరం. ఒక భవనం దృఢత్వం అనేది పునాదిపై ఆధారపడి ఉంటుంది. అలాగే భార్యాభర్తల సంబంధానికి పునాది నమ్మకం. ఒకరిపై మరొకరికి నమ్మకం ఉండాలి.

ప్రవక్త(స) గారు ఇలా చెప్పారు. ఏ స్త్రీ అయితే ఐదు పూటలా నమాజ్ చేసి, రమజాన్ ఉపవాసం పాటించి, తన పిల్లల పాలన, పోషణ సవ్యంగా చేస్తూ భర్త పరోక్షంలో దేవుని రక్షణలో ఉంటూ తన గౌరవ మర్యాదలతో భర్త హక్కులను కనిపెట్టి ఉంటుందో అల్లాహ్ ఆ భార్యకు స్వర్గ ద్వారాలలో ఏ ద్వారం నుంచైనా స్వర్గంలో ప్రవేశించమంటాడు.

## భార్యాభర్తల మధ్య ఒక ఒప్పందం

ఎప్పుడైతే పెళ్లి అవుతుందో అప్పుడు భర్త భార్యతో ఒప్పందం చేస్తాడు. ప్రవక్త(స) గారు పెళ్ళిని సున్నత్ (సంప్రదాయం) అని చెప్పారు. పెళ్ళి చేసుకోవడం వలన సున్నత్ పూర్తి అవుతుంది.

పెళ్ళి ఒక ఒప్పందం. భర్త భార్య అవసరాలను పూర్తి చేస్తాడు. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, ధరించడానికి బట్టలు, ప్రతి సౌకర్యం పూర్తి చేస్తాడు. కావున భార్య కర్తవ్యం భర్త ఆజ్ఞను పాటించడం. భార్య ఇంటి నుండి ఏ పని, ఏ అవసరం కోసం బయటకు వెళ్ళినా భర్త ఆజ్ఞ తీసుకొని వెళ్ళాలి. భర్త అనుమతి లేనిది ఇంటి నుండి బయటకు వెళ్ళరాదు. భార్యాభర్తల నమ్మకం వారి ప్రేమ వలన ఇల్లు స్వర్గంగా మారుతుంది. ఇరువురు తమ పనులు సవ్యంగా చేసుకోవాలి.

**ఖుర్‌ఆన్‌లో వివరించడం జరిగింది** : వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు. అంటే భార్య భర్త ఇరువురు ఒకరికొకరు దస్తులు. దుస్తులు ఏవిధంగానైతే రక్షణను కల్పిస్తాయో అలాగే భర్త భార్యకు రక్షణ కల్పించాలి. భార్యా భర్తలు ఒకరికొకరు అర్థం చేసుకుని తన జీవితాన్ని సుఖంగా గడపాలి. భర్త భార్యతో ప్రేమగా వ్యవహరించాలి అనే ఒప్పందం పెళ్ళి అప్పుడు చేస్తాడు. అదేవిధంగా భార్య భర్త సేవ చేయడం, ప్రేమగా వ్యవహరించాలని ఒప్పందం చేస్తుంది.

## ఒకరికొకరు అర్థం చేసుకోవాలి

ఈ ప్రపంచంలో అతి దగ్గరి సంబంధం భార్యాభర్తల సంబంధం. కాని ఈ రోజుల్లో భార్యా భర్తల మధ్య సరైన అవగాహన లేనందున ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. సమాజానికి ఆయువు పట్టు కుటుంబం. కుటుంబానికి ఆయువు పట్టు భార్యాభర్తల సంబంధం. భార్యాభర్తలు సంతోషంగా సుఖంగా వుంటే పిల్లల భవిష్యత్తు బాగుంటుంది. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే భార్యాభర్తల మధ్య అవగాహన వుండాలి. ఒకరికొకరు అర్థం చేసుకోవాలి. హ్యూమన్ సైకాలజీ ప్రకారం వ్యక్తులు మూడు రకాలుగా ఉన్నారు.

ఏ వ్యక్తినైతే మీరు సంతోషంగా ఉంచాలని అనుకుంటున్నారో ముందు ఆ వ్యక్తి స్వభావాన్ని తెలుసుకోండి.

Auditory Type : ఈ తరహా వ్యక్తి ఎప్పుడు సంతోషంగా వుంటాడంటే మనం ఎప్పుడైతే ఆ వ్యక్తిని పొగుడుతామో అప్పుడు భర్త, భార్య చేసే పనిని, వంటను పొగడడం వలన భార్య సంతోషంగా ఉంటుంది. భర్త పనులను భార్య పొగడడం వల్ల భర్త సంతోషంగా ఉంటాడు. వీరు Auditory Type వ్యక్తులు.

Visualayre type : ఈ రకం వ్యక్తులను ఎంత పొగిడినా లాభం ఉండదు. ఎందుకంటే వీరు Auditory Type వ్యక్తులు కాదు కదా! ఇలాంటి వ్యక్తులకు ఏమైనా బహుమతి ఇవ్వాలి, బయట విహార యాత్రకు తీసుకెళ్ళాలి.అప్పుడు వీరు సంతోషంగా ఉంటారు.

Kinaesthetic type: నీవు ఎంత పొగిడినా, ఎన్ని బహుమతులు ఇచ్చినా వారు సంతృప్తి పడరు. ఈ రకమైన వ్యక్తులు భార్య భర్త ప్రేమ అభిమానం చూపితే చాలు వారు సంతోషపడతారు.

మనిషి జీవితాంతం ఒక వ్యక్తికి ఎంత డబ్బు, ఎంత సంపద ఇచ్చినా వారిని సంతోషపెట్టలేడు. ఎప్పటి వరకైతే ఒక వ్యక్తి మరొక వ్యక్తిని అర్థం చేసుకోలేడో, అప్పటివరకు జీవితం సాఫల్యం కాదు. ఎప్పుడైతే భార్య భర్త ఇద్దరు ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటారో అప్పుడు వారి జీవితం సుఖవంతం, సాఫల్యం అవుతుంది. ఇది మన సమాజానికి ఎంతో అవసరం.

## తల్లి ప్రేమ గొప్పదా? భార్య ప్రేమ గొప్పదా?

తల్లి, భార్య ఇద్దరి స్థానాలు వేర్వేరు. తల్లి స్థానం తల్లిదే, భార్య స్థానం భార్యదే. ఇద్దరిని సమానంగా చూసుకుంటూ ముందుకు వెళ్ళడమే జీవితం. చాలామంది భార్య, తల్లి వీరిద్దరి మధ్య వ్యత్యాసాలతో ఎంతో ఇబ్బందులు పడుతుంటారు. మనిషికి తల్లి కావాలి, భార్యకావాలి. తల్లి లేకపోతే మనశ్శాంతి ఉండదు, భార్యలేకపోతే జీవితం లేదు. తన భార్య తన తల్లిని తల్లిలా చూడాలంటే భర్త తల్లిని, భార్యను గౌరవించాలి. ఇద్దరి అభిప్రాయాలు, ఆలోచనలు ఒకటి అయినప్పుడు జీవితం సుఖంగా గడుస్తుంది. భర్త హృదయంలో ఎవరి స్థానం వారిది, ఎవరు ఎక్కువ కాదు, ఎవరు తక్కువ కాదు. మనిషికి గాలి కావాలా, నీరు కావాలా అంటే దేని ప్రాధాన్యత దానిదే. తల్లి, భార్యల ప్రాధాన్యత మన జీవితంలో ఎంతో వుంది. తల్లిదండ్రుల సేవలోనే మనకు స్వర్గం ఉంది. ప్రవక్త(స) గారు చెప్పారు : తల్లి పాదాల క్రింద స్వర్గం ఉంది. తండ్రి పాదాల క్రింద స్వర్గ ద్వారం వుంది.

భర్త ఎప్పుడు తల్లిని, భార్యను గౌరవించాలి. ఎందుకంటే తల్లి నిన్ను నవ మాసాలు మోసి కని పెంచింది. ఈ ప్రపంచంలోకి తెచ్చింది. భార్య తన ప్రపంచాన్ని తల్లి, తండ్రి, అన్న,చెల్లి అందరిని వదిలి నీతో వచ్చింది.

భార్య భర్తల మధ్య నమ్మకమే ఒక పునాది. నమ్మకం మీదే ఈ సంబంధం నిలిచి ఉన్నది. కావున నమ్మకం అన్నిటికంటే ముఖ్యమైనది.

ఖుర్ఆన్‌లో కూడా చెప్పడం జరిగింది : మంచి భార్య విధేయురాలు భర్త ఆజ్ఞాకారి. అల్లాహ్ ఆజ్ఞను, భర్త ఆజ్ఞల అనుసారంగా ఉంటుంది. కావున వీరిద్దరి సంబంధం దృఢంగా వుండటం ఎంతో ముఖ్యమైనది. ఇరువురు ఒకరికొకరు గౌరవించుకోవాలి. అప్పుడే జీవితం సాఫీగా, సుఖంగా గడుస్తుంది.

## భార్యాభర్తల మధ్య వేరే వ్యక్తులకు చోటు ఇవ్వరాదు

భార్యాభర్తలు ఏ విషయంలోనైనా సరే మూడో వ్యక్తికి చోటు ఇవ్వరాదు. భార్య ఏ విషయం అయినా సరే తన తల్లి, తన తండ్రికి చెప్పి చిన్న విషయాన్ని పెద్దది చేయరాదు. దీనివల్ల భార్యాభర్తల మధ్య ఎంతో మనస్పర్థలు ఏర్పడతాయి. ఏ విషయమైనా సరే ఓపికతో ప్రేమతో సమస్య పరిష్కరించుకోవాలి.

ఒకసారి ఫాతిమా(రజి) అలీ (ర)తో మనస్పర్థల వలన ప్రవక్త (స) ఇంటికి వచ్చింది. అప్పుడు ప్రవక్త ఎవరు వచ్చారని అడిగారు. నేను ఫాతిమా(ర) మీ కూతురు అని సమాధానమిచ్చారు. ఎవరు ఫాతిమా(ర)? అని ప్రవక్త(స) అడిగారు. అప్పుడు ఫాతిమా(ర) హసన్, హుసైన్ తల్లిని అన్నారు. ప్రవక్త ఎవరు అని తిరిగి ప్రశ్నించారు. నేను అలీ(ర) భార్య ఫాతిమా(ర) అని సమాధానమిచ్చారు. అప్పుడు ప్రవక్త(స) అలీ(ర)ని తోడుగా తీసుకురా అని ఆజ్ఞాపించారు. ఈ మాట వినగానే ఫాతిమా(ర) ఇంటికి వెళ్ళి అలీ(ర)ని క్షమించమని అడిగారు. అప్పుడు ప్రవక్త(స) కూడా అలీ(ర) ఇంటికి వచ్చి చెప్పారు. నేను నీకు తలుపు తీస్తే ఎల్లప్పుడు నీవు నీ భర్త ఫిర్యాదు తీసుకొని వస్తావు.

దీనిలో మనకు నీతి ఏమిటంటే మనం మన కూతుళ్లకు ఎప్పుడూ బోధించాలి. భార్య భర్త యొక్క ఏ విషయమై తల్లిదండ్రుల ఇంటికి ఫిర్యాదు తీసుకొనిరాకూడదు. అల్లాహ్ తర్వాత సజ్దా చేసే స్థానం భర్తది అని చెప్పాలి. ప్రతి విషయం సహనంతో, ఓర్పుతో, ప్రేమతో పరిష్కరించుకోవాలి.

## భార్య భర్తను గౌరవించాలి

భార్య వలన భర్తకు గౌరవం, భర్త వలన భార్యకు గౌరవం. ఈ సంబంధం ఎంతో పవిత్రమైనది. ఇరువురు ఒకరికొకరు తమ లోపాలను కప్పిపుచ్చుకోవాలి. ఎందుకంటే మనిషి ఎప్పుడు అన్ని రంగాలలో సమర్థుడు కాదు. మనిషిలో ఏదో ఒక లోపం సహజం. కొంత మందికి జ్ఞానం ఎక్కువ. మరికొందరికి తక్కువ. రంగులలో కూడా వ్యత్యాసం ఉంటుంది. అందరూ ఒకేలా ఉండరు. కావున భార్య భర్తలో ఏ గుణాలు వున్నాయో దానిని గుర్తించి ప్రేరేపం చాలి. భర్త భార్యలో ఏ మంచి గుణాలు ఉన్నాయో గుర్తించి భార్యను ప్రేరేపించాలి. ఇద్దరు ఒకరికొకరు గౌరవించుకోవాలి. దీనివల్ల ప్రేమ, నమ్మకం పెరుగుతాయి. జీవిత చక్రం సుఖంగా, సాఫీగా గడిచిపోతుంది. భార్య భర్త కోసం అలంకరించుకోవాలి.

**(మిగతా 29వ పేజీలో)**




# షర్మిల రాకతో మారబోతున్న ఆంధ్ర రాజకీయ ముఖచిత్రం

**సయ్యద్ ఇబ్రాహీం షరీఫ్**

**వైఎస్ఆర్‌టీపీ** అధ్యక్షురాలు, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ, వైఎస్ జగన్ సోదరి వైఎస్ షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి పలు ఊహాగానాలకు తెరదించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరికను విశ్లేషిస్తే ఎవరికి నష్టం ఎవరికి లాభం అనేది ప్రక్కన పెట్టినట్టయితే కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించడానికి చేస్తున్న ప్రయత్నంగా అభివర్ణించవచ్చు. నవంబర్‌లో జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికలలో ఒక తెలంగాణ మినహా ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇలాంటి తరుణంలో దక్షిణాది రాష్ట్రాల్లో చర్మిషా కలిగిన నేతగా కాంగ్రెస్‌కు తిరుగులేని విధంగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి తనయగా షర్మిల కాంగ్రెస్‌లో చేరడం కాంగ్రెస్‌కు బలాన్ని చేకూరుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇటు ఆంధ్రలో తన అన్న పార్టీ అధికారంలోకి రావడంలో షర్మిల పాదయాత్ర కూడా దోహదం చేసిందనడంలో ఏ విధమైన సందేహం లేదు.

తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలో రావడానికి కూడా షర్మిల అక్కడ తన పార్టీని పోటికి నిలుపకపోవడం ఒక కారణంగా కూడా విశ్లేషించవచ్చు. ఆంధ్ర, తెలంగాణాలను విడదీసింది కాంగ్రెస్ అయిన ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై ఆ ప్రభావాలు ఉండకవచ్చు. దీనికి అధికార బిజెపి చేసిన వాగ్దానభంగాలు కూడా కారణం కాబోతున్నాయి. ఆంధ్రకు ఇస్తామన్న ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, రాజధాని విషయంలో అధికార వైసిపితో కలసి దాగుడుమూతల ధోరణిని అవలంబించడం ఇవన్నీ ఆంధ్రలో తిరిగి కాంగ్రెస్‌కు స్థానం కల్పించబోతున్నాయి. ఇలాంటి తరుణంలోనే కాంగ్రెస్ రాబోయే పార్లమెంటు ఎలక్షన్స్‌ను దృష్టిలో ఉంచుకొని దక్షిణాది రాష్ట్రాల్లో షర్మిలను స్టార్ క్యాంపైనర్‌గా ప్రమోట్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందులో భాగంగా ఆంధ్రలో కూడా పట్టుసాధించడానికి కాంగ్రెస్ తన ప్రయత్నాలను ముమ్మరం చేయబోతుంది. ఎలాగో తెలంగాణా, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది. తమిళనాడు అధికార స్టాలిన్ ప్రభుత్వం ఇండియా కూటమిలో భాగస్వామి అయి ఉంది వామపక్షాలను కాంగ్రెస్ కలుపుకొని వెళ్ళడానికి వెనుకడటం లేదు. వీటన్నిటినీ కలిపి చూసినప్పుడు రాబోయే లోక్‌సభ ఎలక్షన్స్‌లో కాంగ్రెస్ అధిక శాతం సీట్లను దక్షిణాది రాష్ట్రాల నుండి ఆశిస్తుందనడంలో సందేహమే లేదు.

ఈ తరుణంలో భావసారుప్యాత కలిగిన అన్ని పార్టీలను అలాగే ఎన్‌జీవోలను కాంగ్రెస్ కలుపుకొని ముందుకెళ్ళడానికి సమాయత్తం అవుతుందనడానికి దేశంలో కాంగ్రెస్ ఒక్కటే సెక్యులర్ పార్టీ అన్న షర్మిల వ్యాఖ్యలు బలాన్ని చేకూరుస్తు న్నాయి. ఇదే క్రమంలో రాష్ట్రంలో కూడా 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ముందుకు వెళ్ళ డానికి సన్నద్ధం అవుతుందనడంలో ఏ విధమైన సందేహం లేదు. వైఎస్ షర్మిళకు కాంగ్రెస్ ఎపిపిసిసి పగ్గాలు ఇచ్చి వైఎస్‌ఆర్‌సీపీ అసంతృప్త నేతలను వైఎస్ఆర్ కుటుంబంపై ఉన్న అభిమానాన్ని అదే సందర్భంలో కాంగ్రెస్ సంప్రదాయక ఓటు బ్యాంకును తిరిగి తన సొంతం చేసుకోనే ప్రయత్నాలను కూడా ప్రారంభించింది. ఈ తరుణంలో ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ రాష్ట్రంలో తన ప్రభావం చూపకపోయినప్పటికీ వైఎస్ షర్మిల రూపంలో ఒక మాస్ ఇమేజ్ ఉన్న నాయకురాలు కాంగ్రెస్‌కు లభించినట్టుగా భావించవచ్చు.

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకోనే నిర్ణయాల పట్ల కూడా కాంగ్రెస్ గ్రాఫ్ ఆధారపడి ఉంటుంద నడంలో ఎలాంటి సందేహం లేదు. వచ్చిన ప్రతీ అవకాశాన్ని షర్మిల ఏ విధంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా మలుస్తారన డంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. ఇందులో మరో కొసమెరుపు కూడా ఉంది. వైఎస్ జగన్, టిడిపి జనసేన కూటమికి ప్రభుత్వ వ్యతిరేక ఓటు వెళ్ళకుండా, వారిని అధికారానికి దూరం చేసే ప్రయ త్నాలు చేస్తారనడంలో సందేహం లేదు. అదే సందర్భంలో వైఎస్ఆర్ సిపి నుండి వలసలను జనసేన, టిడిపి కూటమి వైపు కాకుండా కాంగ్రెస్ వైపునకు మళ్ళించే దిశగా వైఎస్ జగన్ తన వ్యూహాన్ని మలిచినట్టుగా కూడా కన్పిస్తుంది. దీని కొరకే వైఎస్ షర్మిలను కాంగ్రెస్‌తో జతకట్టే విధంగా వ్యూహన్ని రచించి ఆమె రూపంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును కాంగ్రెస్‌కు చేరేలా చేసి తన అధికారాన్ని నిలబెట్టుకోనే ప్రయ త్నంలో భాగం కూడా అయి ఉండవచ్చు. తద్వారా ప్రస్తుతం నేరుగా కాకుండా తన సోదరి ద్వారా కాంగ్రెస్‌కు దగ్గరయ్యే ప్రయత్నంలో భాగంగా తాను వ్యూహాత్మక అడుగులు వేస్తు ఉండవచ్చు. తద్వారా కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వం ఏదైనా తాను ఆ ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే విధంగా వైఎస్ జగన్ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచు కొని ఉండవచ్చు. ఏది ఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వైఎస్ షర్మిల రూపంలో భవిష్యత్తుకు పునాదులు వేయబడ్డాయని మాత్రం చెప్పవచ్చు. మిగిలిన విశ్లేషణలు ఊహాగానాలకు కాలమే సమాధానం చెప్పబోతుందని ప్రజలు భావిస్తున్నారు. ✤

# భార్యాభర్తల సంబంధం

(27వ పేజీ తరువాయి)

అదేవిధంగా భార్య లోపాలను భర్త ఎల్లప్పుడూ ఎత్తిచూపడం, భర్త లోపాలను భార్య ఎత్తి చూపడం వలన భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. దీని మూలంగా జీవితంలో, సంబంధంలో ఎన్నో అనర్థాలు తలెత్తుతాయి. చివరికి విడాకుల వరకు కూడా వ్యవహారాలు వెళ్తాయి. కావున భార్యా భర్తలు ఎంతో ఓపికతో, సహనంతో జీవితం గడపాలి.

ప్రవక్త(స) గారు చెప్పారు.. "ఏ స్త్రీ అయితే తన భర్తను అన్ని రకాలుగా సంతుష్టుణ్ణి చేస్తుందో ఆ పరిస్థితిలో ఆమె మరణిస్తే ఆమెకు స్వర్గం ప్రాప్తిస్తుంది."

ఇస్లామ్ భార్య భర్తల పనితీరును వివరించింది : భర్త బయట పనిచేసి సంపాదిస్తాడు, భార్య ఇంటి పని, పిల్లల పాలన, పోషణ చేస్తుంది. భార్య ఇంటిని తీర్చిదిద్ది భర్తను ఆహ్వానిస్తుంది. ఈ సమాజం వర్తమానం మగవారిపైన వుంది. సమాజం భవిష్యత్తు స్త్రీపైన ఉంది. పిల్లల సరైన పెంపకం వలన సమాజం పురోగతి జరుగుతుంది.

సమస్యలనేవి అందరికీ వస్తాయి. పుట్టుక నుంచి మరణించే వరకు ప్రతి క్షణం సమస్యలతో నిండి ఉంటుంది. ఆ సమస్యని ఎంత ధైర్యంగా ఎదుర్కొంటున్నాం, ఎంత నిలకడగా ఎదుర్కొం టున్నాము అన్నది ముఖ్యం. ఎన్ని సమస్యలు వచ్చినా ఎంత కష్టం వచ్చినా అది శారీరకంగా గాని, మానసికంగా కాని ఏదైనా సరే చిరునవ్వు అనే ఒక పెద్ద ఆయుధంతో చాలా సమస్యలకు పరిష్కారం చేయవచ్చు. డబ్బు పోతే తిరిగి వస్తుంది. వస్తువు పోతే తిరిగి వస్తుంది, కాని సంబంధం ఒక్కసారి పోతే తిరిగిరాదు. కావున సంబంధాలను కాపాడుకోవాలి.

ప్రవక్త(స), ఖతీజా(ర) కూడా మనకు మంచి ఉదాహరణ. ఏ విషయమైనా ఖతీజా(ర) ప్రవక్త (స)కు ఎంతో ధైర్యాన్ని, ఎంతో ప్రేమతో ప్రతి సమస్యకు పరిష్కారం చూపేవారు. హిరా గుహలో ఖుర్ఆన్ అవతరించినప్పుడు కూడా ఖతీజా(ర) ఎంతో ధైర్యాన్ని, ఎంతో ఓర్పును ఇచ్చారు. మనం కూడా మన భర్తకు ప్రతి విషయంలో అండగా వుండాలి. తద్వారా భార్యాభర్తల సంబంధం ఎంతో దృఢంగా వుంటుంది. అల్లాహ్ మనందరి జీవితాలను ప్రేమతో, ఆప్యాయతతో సఫలీకృతం చేయాలి. ✤

**జనవరి 2024 సంచికతో చందా పైకం ముగిసిన పాఠకులు తమ చందా పైకాన్ని పంపి రెన్యువల్ చేసుకోవాలని మనవి.**

**– సర్క్యులేషన్ మేనేజర్**




దియా, విజయవాడ

ప్రకృతి మనిషికి ఎన్నో పాఠాలు నేర్పుతుంది. మనం ఆకాశంలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులను చూస్తూ ఉంటాం. ఆ పక్షుల్లాగా తాను కూడా ఎగరాలనే తపనే విమానాల ఆవిష్కరణకు పునాది వేసింది. ప్రతి రోజు మనం చూసే రాత్రి, పగలు పరిభ్రమణ మన జీవితంలోని కష్టసుఖాలకు ఉపమానాలు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ఎన్నో కీటకాలు, జంతు జాలాలు తోడ్పడుతున్నాయి. సర్వమానవాళికి మార్గదర్శిగా అవతరించిన ఆఖరి ఆకాశ గ్రంథమైన దివ్య హుద్ హుద్ అనే పక్షి దైవ సందేశాన్ని అందించిన అపూర్వ విధానాన్ని ఖుర్ఆన్ తెలుపుతుంది. సృష్టికర్త అబాబీల్ అనే పక్షుల ద్వారా యుద్ధంలో దైవదాసులకు దైవ సహాయాన్ని అందించిన సంఘటన ద్వారా మనకు పక్షులు కూడా మానవ జీవన సరళిని సంస్కరించగలవనే విషయాన్ని విశదపరుస్తున్నాయి. ఇప్పుడు మనం కావ్.. కావ్...అని అరిచే కాకికి సంబంధించిన కొన్ని కాకమ్మ కబుర్లు తెలుసుకుందాం.

'అనర్హులకు అందిన ఫలాన్ని కాకి ముక్కుకు దొండపండు' అని పోల్చడం, 'ఈ ఇంటి మీద కాకి ఆ ఇంటి మీద వాలకూడదు' అనే పౌరుషానికి వాడే సామెతలు తెలుసు. అలాగే కాకితో కబురంపితే చాలు.. వచ్చేస్తాను అని అనటం, ఎంగిలి చేత్తో కాకికి కూడా మెతుకులు విదల్చని రకమని పిసినారి వారిని వర్ణించటం పరిపాటి. సాధారణంగా పక్షులన్నిట్లో పిల్లలు రెక్కలు రాగానే ఎగిరిపోయి తమ బతుకు తాము బ్రతకటం చూస్తుంటాం. కాని కాకులు మనుషుల్లాగే చాలా ఓపిగ్గా జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ చాలాకాలం పెంచుతాయి. ఈ సంఘటనయే వాటిని మిగతా పక్షులకన్నా భిన్నంగా, తెలివైన వాటిగా మార్చింది అంటున్నారు శాస్త్రవేత్తలు. మ్యాక్స్‌ప్లాంట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద సైన్స్ ఆఫ్ హ్యూమన్ హిస్టరీకి చెందిన శాస్త్రవేత్తలు పక్షుల్లో తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల తెలివి తేటల్ని ఎలా ప్రభావితం చేస్తుందన్న విషయంపై పరిశోధన చేశారు. అన్నిటికన్నా కోర్విడై కుటుంబానికి చెందిన పక్షులే ఎక్కువ కాలం పొదగడటం, పిల్లలకు రెక్కలొచ్చినా బయటకు వెళ్ళనీయకుండా తామే తిండి తెచ్చి పెట్టడం చేస్తున్నాయి.

కాకులు దాదాపు నాలుగేళ్ళపాటు పిల్లల్ని తమ దగ్గరే ఉంచుకొని అన్నీ నేర్పిస్తాయి. పిల్లలు తాము నేర్చుకుంటూ చిన్న పిల్లల్ని పెంచటంలో అమ్మానాన్నలకు సాయంగా ఉంటాయి. అలా పెరగటం వల్లనే వీటి మెదడు మిగతా పక్షులకన్నా పెద్దగా ఉంటోంది. కాకి మెదడు అచ్చం మనుషుల్లాగే శరీర బరువులో రెండు శాతం ఉంటుందట. అందులో కూడా జ్ఞాపకశక్తికి సంబంధించిన భాగం కాకుండా విశ్లేషణా శక్తికి సంబంధించిన మెదడు భాగం పెద్దగా ఉండటంతో ఇవి తెలివైన పక్షులుగా మొదటి స్థానంలో నిలుస్తున్నాయి. కాబట్టే సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ కాకికి సంబంధించిన ఒక ఉదంతాన్ని దివ్య ఖుర్ఆన్‌లో పొందుపరచటం జరిగింది. ఆ సంఘటన ఏమంటే ఆదం(అ)

కుమారులలోని వైరం తన తోటి సోదరుణ్ణి అంతం చేయటం వరకు వెళ్ళింది. ఈ విషయమై దివ్య ఖుర్‌ఆన్ చివరకు అతడి మనస్సు తన సోదరుని హత్యను అతడి కొరకు సులభ సాధ్యం చేసింది. అతడే అతన్ని చంపి నష్టపోయేవారిలో కలిసిపోయాడు. అప్పుడు అల్లాహ్ ఒక కాకిని పంపాడు. అది నేలను తవ్వసాగింది. తన సోదరుని శవాన్ని ఏ విధంగా దాచాలో అతడికి తెలుపటానికి. ఇది చూసి అతడు రోదించాడు. 'అయ్యో నేను పాడుగాను! నేను ఈ కాకి పాటి వాణ్ణి కూడా కాలేకపోయానే. నా సోదరుని శవాన్ని దాచే ఉపాయం వెతకలేకపోయానే. తరువాత అతడు తాను చేసిన దానికి ఎంతో పశ్చాత్తాపపడ్డాడు. (5: 30,34) అని తెలుపటం జరిగింది. కాకి చూపిన విధంగా ఆ తర్వాత నేలను తవ్వి తన సోదరుని శవాన్ని పూడ్చటం జరిగింది. మనుషులకే కాదు కాకులకీ బలగమే బలం.

జీవిత కాలం ఒకే భాగస్వామితో ఉండటానికి ఇష్టపడే కాకులు కుటుంబ జీవితాన్ని, సంఘ జీవితాన్ని కూడా సమపాళ్ళలో ఆస్వాదిస్తాయి. కాకులకు హాని కలిగిస్తే అవి ప్రతీకారం తీర్చుకుంటాయన్నది నిజమే. ఇవి మనుషుల ముఖాలను ఎన్ని ఏళ్ళయినా గుర్తుపట్టగలుగుతాయి. అలాంటి వ్యక్తులు కనిపించ గానే బాగా అరుస్తాయి. వాటి భాషలో అది తిట్టడం అంటారు శాస్త్రవేత్తలు. ఏడేళ్ళ పిల్లలు ఎంత తెలివిగా ఉంటారో కాకులు కూడా అంత తెలివిగా వ్యవహరిస్తాయని పరిశోధనల్లో తేలింది. తెలివిగా పనిచేయటమేకాక నేర్పిస్తే కొత్త పనుల్ని నేర్చుకుంటున్న కాకుల సేవల్ని వీధులు శుభ్రం చేయటానికి వాడుకుంటే ఎలా ఉంటుందన్న ఆలోచన కొందరికి వచ్చింది. ఈ ఆలోచనను అందిపుచ్చుకుంది ఫ్రాన్స్‌లోని ఓ థీమ్ పార్కు, చెత్తను తెచ్చి బుట్టలో పడేసేలా ఆరు కాకులకు శిక్షణ ఇచ్చారు. ఒకసారి డబ్బాలో చెత్తను పడేస్తే ఆ డబ్బాలోనే మరో పక్క నుంచి కాకికి నచ్చే ఆహారం వస్తుంది. అది తిని మళ్ళీ చెత్త వెతకడానికి వెళ్ళేవి. నిజానికి పక్షులతో పని చేయించుకోవటం తమ ఉద్దేశం కాదనే పక్షుల్ని చూసి అయినా మనుషులు మారి ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేయకుండా ఉంటారని తమ ఆశ అని పార్కు యాజమాన్యం చెబుతోంది. ఇది చూసిన మరికొందరు కాకులకు ఎక్కడన్నా నాణేలు దొరికితే తెచ్చి వేయడానికి ఒక వెండింగ్ మెషీన్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ కూడా మంచి ఫలితమే రావటం విశేషం. కాకులకు క్రమశిక్షణ ఎక్కువే. వీటిని మచ్చిక చేసుకోవటం, శిక్షణ ఇవ్వటం చాలా తేలిక. పెరట్లోనో, బాల్కనీ లోనో కాస్త తిండి పెడితే రోజూ కచ్చితంగా అదే సమయానికి వచ్చి తిని వెళ్ళటం మనకు తెలిసిన అనుభవమే.

చనిపోయిన కాకి చుట్టూ గోలగోలగా అరుస్తాయి కాకులు. కొన్ని గంటలు, ఒక్కోసారి కొన్ని రోజులు ఇవి ఆ పరిసరాల్లో తచ్చాడతాయి. ఈ విషయంపై పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు ఏమంటున్నారంటే, కాకి చావుకు కారణమేమిటి, చుట్టుప్రక్కల కొత్తగా శత్రువులు ఏమైనా వచ్చాయా, వాటి వల్ల నాకు ప్రమాదం ఉందా, దాన్ని నేనెలా తప్పించుకోవాలి, ఈ ప్రాంతంలో ఎలాంటి ఆహారం దొరుకుతుందీ, అదేమైనా దాని చావుకు కారణమా... ఇలా అన్ని కోణాల్లో ఆలోచిస్తాయట. దాన్నీ మనం సంతాపంగా భ్రమపడుతున్నామంటున్నారు శాస్త్రవేత్తలు. ఇక ఆ అరుపులు ఆ కాకి చావుకు కారణమైన శత్రువును తిట్టటమేనట. నీళ్ళలో పూర్తిగా మునగకుండా రెక్కలు టపటపలాడిస్తూ ఒంటి మీద నీళ్ళు జల్లుకోవటం దానికి సరదా. అందుకే ఎవరైనా హడావుడిగా రెండు చెంబులు నీళ్ళు పోసుకుని వస్తే కాకి స్నానం అని అంటారు.

2020లో సైన్స్ పత్రికలో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం అవి సంక్లిష్టంగా ఉన్న పనులను కూడా ఆలోచించి చేయగలవు. గత అనుభవాలన్నీ ఎప్పుడో చూసిన దృశ్యాల్నీ గుర్తుతెచ్చుకొని విశ్లేషించుకొని నిర్ణయాలు తీసుకుంటాయి. పల్లెల్లో కాకి వేరుశనక్కాయలు నేలకేసి కొట్టి పగలకొడితే పట్టణాల్లో కాకి వాటిని వాహనాలు తిరిగే రోడ్డు మీద వేసి పగల గొట్టడాన్ని పరిశోధకులు గమనించారు. వాహనం చక్రం కింద గింజ నలిగాక ట్రాఫిక్ లైట్లు చూసి వాహనాలు ఆగాకే వెళ్ళి ఆ పప్పు తెచ్చు కుంటుంది. మెదడులో కణాలూ, న్యూరాన్లు ఎక్కువగా ఉండి అవి సమాచారాన్ని ప్రాసెస్ చేయగలిగినప్పుడే ఇలా సొంతంగా ఆలోచించటం చేతనవుతుందని శాస్త్రవేత్తల అభిప్రాయం. అంతేకాదు కాకుల మెదడులో ఒక్కో సగంలోనూ 200- 300 మిలియన్ల న్యూరాన్లు ఉంటాయట.

ఏ వస్తువు నీటిలో తేలుతుందో, ఏది మునుగుతుందో వాటికి తెలుసు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఒక పరిశోధన చేశారు. సన్నని గొట్టంలా ఉన్న గ్లాస్‌నూ, వెడల్పుగా ఉన్న గ్లాస్‌నూ పెట్టి వాటిల్లో కొద్దిగా నీళ్ళు పోసి కాకి ఆహారాన్ని వేశారు. పక్కన కొన్ని రాళ్ళూ, రాళ్ళలా కనిపించే స్పాంజి ముక్కలూ పెట్టారు. కాకులు సన్నగా ఉన్న గ్లాసునే ఎంచుకొని గబగబా రాళ్ళు వేసి ఆహారాన్ని అందుకున్నాయట. అంటే పాత్ర సైజూ నీటి పరిణామమూ ఏదైతే తొందరగా నిండుతుంది, ఏది మునుగుతుందీ ఏది మునగదు... లాంటివన్నీ కూడా అవి ఆలోచించగలవన్నమాట. కాకిని జ్ఞానానికీ, భవిష్యత్తుకీ మార్పుకీ మరణానికీ మరణానంతర జీవితానికి... ఇలా మంచి చెడు రెండింటికీ ప్రతీకగా భావిస్తారు. ప్రపంచమంతటా కనిపించే పక్షి ఇదొక్కటే మరి. కాకి ఒక్కటే ఇలా విశ్వవ్యాప్తమవటానికి కారణం భిన్న పరిస్థితులకు తగినట్లుగా సర్దుకుపోయే దాని స్వభావం. అందువల్లనే మిగిలిన పక్షులకన్నా కాకి బలమైనదీ, తెలివైనదిగా ఎదిగింది.

ఇవండీ, కాకమ్మ కబుర్లు. తెలివితేటల్లో కాకులు వాటికవే సాటి. కొద్దిగా నీళ్ళు ఉన్న జగ్గులో రాళ్ళు వేసి నీరుపైకి వచ్చాక తాగి వెళ్ళిన కాకి కథ తెలిసిందే. వాటి తెలివి తేటల్ని గమనించి చెప్పిన కథే కావటం గమనార్హం. ✤



# స్త్రీ వారసత్వపు హక్కు

మూలం : మౌలానా సయ్యిద్ జలాలుద్దీన్ ఉమ్రీ　　　　తెలుగు రూపం : ఎస్. ఎమ్. మలిక్

దీనిద్వారా దిగువ సూత్రాలు ఉత్పన్నమవుతాయి :

1) మృతుడు సంతానవంతుడు, ఒకే కుమారుడు లేదా కుమార్తె కావచ్చు, అప్పుడు తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరికి ఆరవ వంతు (1/6) లభిస్తుంది. సంతానంలానే మనుమలు, వారి సంతానం కూడా ఈ ఆదేశం క్రిందికే వస్తారు.

2) మృతునికి సంతానం లేకపోతే తల్లి వాటా మూడింట ఒక వంతు 1/3 అవుతుంది. మిగతా మూడింట రెండు వంతులకు తండ్రి వారసుడవుతాడు.

3) మృతునికి సంతానమయితే లేదు కాని ఇద్దరు లేదా ఇద్దరికన్నా అధికంగా సోదర సోదరీలున్నట్లయితే (వారు ఎటువంటి విధమయిన వారయినా సరే) తల్లి వాటా ఆరవ వంతు 1/6 అవుతుంది. మిగతా ఆస్తి అంతా తండ్రికే దొరుకుతుంది. సోదరీ సోదరులకు ఏ వాటా ప్రాప్తం కాదు.

సంతానం, తల్లిదండ్రుల హక్కులు తెలిపిన తరువాత ఇలా సెలవీయబడినది:

**మృత వ్యక్తి చేసిన వీలును నెరవేర్చి ఆ వ్యక్తిపై ఉన్న అప్పులు తీర్చివేసిన తరువాత (ఈ వాటాలన్నీ పంచాలి) మీకు తెలి యదు– మీ తల్లిదండ్రులూ మీ సంతానాల్లో లాభం దృష్ట్యా మీతో అధిక సన్నిహితత్వం గలవారెవరో. ఈ వాటాలను అల్లాహ్ నిర్ణయించాడు. అల్లాహ్ నిస్సందేహంగా సమస్త యదార్థాలను ఎరిగిన వాడు, సకల ఔచితీ విజ్ఞతలు తెలిసినవాడు.** ***(అన్ నిసా: 11)***

దీని భావమేమిటంటే ముందు వీలునామా ప్రకారం అమలు జరిపి, అప్పులు తీర్చడం జరుగుతుంది. ఆ తరువాత మిగిలిన ఆస్తిని వారసుల్లో విభజించటం జరుగుతుంది. (మృతుడు వదలిన ఆస్తిలో దిగువ నాలుగు హక్కులున్నాయి :

1. మృతుని తజ్హీజ్ వ తక్ఫీన్ (ఇస్లామ్ రీత్యా అంత్యక్రియలు) సగటు విధంగా ఏర్పాట్లు
2. అప్పు ఉంటే దాన్ని తీర్చటం
3. వీలు చేసి ఉంటే దాన్ని అమలుపరచటం
4. మిగిలిన ఆస్తి వారసుల్లో షరీఅత్ చట్టం ప్రకారం విభజించడం.

ఆయత్‌లో అప్పు ప్రస్తావన వీలు తరువాత ఉంది. దీని భావం మొదట వీలును నెరవేర్చడం జరుగుతుందని అర్థం కాదు, ఆ

తరువాత సొమ్ము మిగిలితే అప్పు తీర్చడం జరుగుతుందనీ అర్థం కాదు. అసలు భావం ఏమిటంటే వీలును, అప్పునూ తొలుత పూర్తి చెయ్యవలసి ఉంటుంది. ఆ తరువాతనే వారసత్వపు విభజన జరుగుతుందన్నది. అప్పు అన్నది మనిషికి విధితమయ్యే పరుల హక్కు. బ్రతికి ఉన్నప్పుడు దాన్ని చెల్లించడం ఎలా అనివార్యమో అలాగే మరణించిన తరువాత కూడా అతని సొమ్ములో నుంచి దాన్ని చెల్లించడం అంతే అవసరం. దాని కొరకు మృతుడు వీలు వ్రాయనవసరం లేదు, అది విధి కాదు. వీలు అన్నది అదనపు చర్య. విధి అయినది అదనపు చర్యపైన ప్రాధాన్యత పొందుతుందన్నది విదితమే. (ఫర్జ్‌కు నఫ్ల్‌పైన ప్రాధాన్యత గలదు). ఆయత్‌లో వీలును తొలుత ప్రస్తావించ డానికి కారణం, అది మృతుని అదనపు చర్యగా భావించి చూపోపు వహించరాదని మాత్రమే. మృతుడు వీలు చేసినందుకు దాన్ని అమలుపరచడం అవసరమని చెప్పడానికి. హజ్రత్ అలీ (ర) ఉల్లేఖించిన ఓ హదీసు ద్వారా కూడా దీనికి బలం చేకూరు తుంది. దైవ సందేశ హరులు (స) అప్పుకు వీలుపైన ప్రాధాన్యత నిచ్చారు. (తిర్మిజీ, ఇబ్నుమాజా, దారిమీ). వీలును గురించి హదీసులో విశదీకరణ ఇదీ ఉంది, అది మొత్తం ఆస్తిలో మూడవ వంతుకు మించి ఉండరాదు. హజ్రత్ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర) తన సొమ్మునంతటినీ వీలుద్వారా ఇవ్వదలచినప్పుడు ఆయన (స), "నీవు మూడవ వంతు వీలు చేయగలవు, మూడవ వంతు కూడా అధికమే" అని అన్నారు)

## భార్యాభర్తల హక్కు

వారసత్వంలో భార్యాభర్తల హక్కులు దివ్య కుర్‌ఆన్‌లో ఈ విధంగా వివరించబడ్డాయి :

> **మరి మీ భార్యలు వదలినది ఏదయినా అందులో సగం వాటా మీకు లభిస్తుంది– వారు సంతానహీనలయిన పక్షంలో. అలాకాక వారు సంతానం గలవారయితే వారు వదలిన వారసత్వంలో నాల్గవ వంతు మీదవుతుంది– వారు చేసిన వీలును నెరవేర్చిన తరువాత, వారు వదలిన అప్పు తీర్చిన పిమ్మట. మీకు సంతానం లేనట్లయితే, మీరు వదలిన వారసత్వంలో, వారు నాల్గవ వంతుకు హక్కు కలిగి ఉంటారు, అలాకాక మీరు సంతానవంతు లయిన పక్షంలో వారి వాటా ఎనిమిదవ వంతు అవుతుంది– మీరు చేసిన వీలునామా నెరవేర్చి, మీరు వదలిన అప్పు తీర్చిన తరువాత.** ***(అన్ నిసా: 12)***

ఈ ఆయత్ ద్వారా దిగువ పేర్కొన్న విషయాలు తెలుస్తున్నాయి:

1) భార్య వదలిన ఆస్తిలో భర్తకు సగం వాటా లభిస్తుంది. భార్యకు సంతానం (ఈ భర్త వల్లనయినా లేదా మునుపటి భర్త వల్లనయినా) లేకపోతే. సంతానంలో మనుమడు కూడా ఉన్నాడన్న విషయంలో ఏకాభిప్రాయముంది.

2) సంతానమున్నట్లయితే నాల్గవ వంతు 1/4 వాటా లభిస్తుంది. ఆ సంతానం ఈ భర్తవల్లనయినా కావచ్చు లేదా మునుపటి భర్త వల్లనయినా కావచ్చు.

3) భార్యకు భర్త వదలిన ఆస్తి నుండి నాల్గవ వంతు వాటా లభిస్తుంది, భర్తకు సంతానం లేనిపక్షంలో.

4) భార్యకు భర్త ఆస్తిలో 1/8 ఎనిమిదవ వంతు వాటా లభిస్తుంది. భర్తకు సంతానం ఉన్న పక్షంలో. సంతానం ఈ భార్య ద్వారా, లేదా మరో భార్య ద్వారా అయినా సరే.

## (సవతి) అఖ్యాఫీ సోదర సోదరీల హక్కు

సంతానం, తల్లిదండ్రులు, భార్యాభర్తలు ఎట్టి పరిస్థితిలోనూ వారసులవుతారు. వీరి తరువాతనే ఇతర బంధుగణం హక్కు పరిగణనలోకి వస్తుంది. వారిలో ప్రప్రథమంగా మృతుల సోదర సోదరీలు వస్తారు. సోదర సోదరీలు మూడు విధాలు. అయినీ, అల్లాతీ, అఖ్యాఫీ (అయినీ అంటే స్వంత సోదరసోదరీలు ఒకే తల్లిదండ్రులకు పుట్టినవారు. అల్లాతీ అంటే సవతి సోదర సోదరీలు, వీరి తండ్రి ఒక్కడే అయినా తల్లులు వేరే అయి ఉంటారు. అఖ్యాఫీ అంటే తల్లి ఒక్కతే అయినా తండ్రులు వేరే అయినవారు అన్నమాట). వీరిలో అయినీ అంటే స్వంత సోదర సోదరీల హక్కు అందరికన్నా ప్రధానమయింది. వారు లేకపోతే అల్లాతీ సవితి (తండ్రి ఒక్కరే అయినా తల్లులు వేరే అయినవారు) సోదర సోదరీలు వారసులవుతారు. వారి వాటా నిర్ణీతమయి ఉంది. వారి వాటాలు ఈ ఆయత్‌లో వివరించబడ్డాయని ముస్లిమ్ సముదాయం ఏకగ్రీవాభిప్రాయం.

> **(ఎవరి వారసత్వపు పంపకం జరుగుతున్నదో వారు) స్త్రీ అయినా పురుషుడయినా సంతాన హీనులూ అయి, వారి తల్లిదండ్రులు సయితమూ సజీవంగా లేకపోయి, ఒక సోదరుడో లేదా ఒక సోదరియో ఉన్నట్లయితే సోదర సోదరీలలో ప్రతి ఒక్కరికి ఆరవ వంతు వాటా లభిస్తుంది; మరేమో సోదరసోదరీలు ఒకరికన్నా అధికమయితే మొత్తం వారసత్వంలోని మూడవ వంతు భాగంలో వారంతా భాగస్వాములవుతారు– (పంపకం ఏది చేసినా) వీలును నెరవేర్చి, మృతుడు వదలిన రుణాన్ని తీర్చిన తరువాతనే– అయితే అది హానికరం కారాదు. ఇది అల్లాహ్ తరపున ఆదేశం, అల్లాహ్ సర్వోపరిజ్ఞాని, మృదు స్వభావి.**
>
> ***(అన్ నిసా : 12)***

**(మిగతా వచ్చే సంచికలో)**

# కొబ్బరి పాలతో జున్ను

ఖాసిమా షాహీన్, ఖమ్మం




## కావలసిన పదార్థాలు!

రెండు కప్పుల కొబ్బరి ముక్కలు
రెండు కప్పుల నీళ్ళు
రెండు టీ స్పూన్ సగ్గు బియ్యం
ఒక కప్పు షుగర్
ఒక టీ స్పూన్ Ager ager పౌడర్ (geltin powder)
ఫుడ్ కలర్
వెనీలా ఎసెన్స్ & ఇలాచి పౌడర్
టూ టీ ఫ్రూటీలు

## ఇప్పుడు తయారు చేసే విధానం!

ఇప్పుడు తయారు చేసే విధానం!

"రుచికరమైన కొబ్బరి పాలతో జున్ను తయారీ" చూద్దాం

ఒక గ్రైండింగ్ జార్‌లో సన్నగా తరిగిన రెండు కప్పుల కొబ్బరి ముక్కలను వేసుకోండి.

దీన్ని ఫస్ట్ గ్రైండ్ చేసుకోవాలి. గ్రైండ్ అయిన తర్వాత మనం ఏ కప్పుతో తీసుకున్నామో ఆ కప్పుతో రెండు కప్పుల నీళ్లు పడతాయి. కాకపోతే రెండు ఒకేసారి వేయకుండా ఒక కప్పు నీళ్ళు వేసి గ్రైండ్ చేసుకున్న తర్వాత మరొక కప్పు నీళ్ళు వేసుకొని మెత్తగా పేస్ట్ లాగా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఒక స్టైనర్ పెట్టండి ఒక క్లాత్‌లో వేసి వడకట్టుకోండి.

ఎక్కువ నీళ్ళు వేయకూడదు. ఎక్కువ నీళ్ళు వేస్తే పాలు చిక్కదనం తగ్గిపోతుంది. టేస్ట్ కూడా మారిపోతుంది. రెండు



కప్పుల కొబ్బరి ముక్కలకి రెండు కప్పుల నీళ్ళు మాత్రమే వేసుకోండి. ఈ విధంగా క్లాత్‌లో వేసి మొత్తంగా దగ్గరగా అనేసి బాగా పిండుకోవాలి.

కొబ్బరి పాలు అనేవి ఇలా తయారు చేసుకోవాలి.

మనం ఎక్కువ నీళ్ళు వేసినట్లయితే ఇవి పల్చగా అయి పోతాయి. కొలత ప్రకారం మాత్రమే నీళ్ళు తీసుకోండి. మీకు అప్పుడు చిక్కటి కొబ్బరి పాలు అనేవి రెడీ అవుతాయి. వీలైనంతవరకు కొబ్బరిని బాగా పిండుకోండి పూర్తిగా పాలు రావాలి. ఇలా పిండిన తర్వాత పాలలో స్వీట్ సరిపడినట్లుగా చక్కెర వేయాలి. జెలటిన్ వన్ టీ స్పూన్ ఇది గడ్డ కట్టడం కోసం మార్కెట్లో దొరుకుతుంది. ఒక టేబుల్ స్పూన్ వేసి ఒక పావు కప్పు మాత్రమే ఉడికించుకోవాలి. సగ్గుబియ్యం ఉడకడానికి కొంచెం టైం పడుకుంది సగ్గుబియ్యం పూర్తిగా ఉడకనియ్యాలి. కొంచెం కలర్ ఫుల్‌గా ఉండడం కోసం కలర్ వేసుకోవాలి. ఇక్కడ మీకు ఇష్టమైన ఫుడ్ కలర్ వేయ వచ్చు. ఫుడ్ కలర్ వేసిన తర్వాత ఉడికించుకోవాలి.

కొబ్బరి పాలను ఒక బౌల్‌లో వేసుకొని వెనీలా ఎసెన్స్ లేదా ఇలాచి పౌడర్ వేసుకుంటే టేస్ట్ బాగా వస్తుంది. ఇలా తయారు చేసుకునే మిశ్రమానికి నురగ వస్తుంది. అలాగే కొంచెం టూటీఫ్రూటీలు వేసుకోండి. ఇది ఆప్షనల్ అంతే! రెండు గంటల తర్వాత సెట్ అయిన కొబ్బరి పాల జున్ను రెడీ. లేదంటే కొంచెం చల్లగా అయిన తరువాత సర్వ్ చేయాలి.

Edited, Printed & Published by Sultan Mohiuddin Mallick on behalf of Telugu Islamic Publications, Printed at Cosmic Printers, 22-8-584/6, Lakkadkot, Chatta Bazar, Hyderabad-2, RNI APTEL/2012/47740, Postal Concessional Regn. No. HSE/1006/2023-2025 ; Ph. 040 - 24576237